శ్రీశైలం ఏఈవో సస్పెన్షన్

శ్రీశైల ఆలయం, న్యూస్‌టుడే: శ్రీశైల దేవస్థానంలో పని చేస్తున్న సహాయ కార్యనిర్వాహణాధికారి(ఏఈవో) ఎం.ఫణిధర్ ప్రసాద్‌ను సస్పెండ్ చేస్తూ దేవస్థానం ఈవో డి.పెద్దిరాజు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఫణిధర్ ప్రసాద్ రెవెన్యూ విభాగం ఏఈవోగా విధులు నిర్వర్తించిన సమయంలో పలు అక్రమాలకు పాల్పడినట్లు హిందూ సంఘం నాయకుడు ఇచ్చిన లిఖిత పూర్వాక ఫిర్యాదు మేరకు దేవదాయశాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ ఆర్జేసీ స్థాయి అధికారిని విచారణాధికారిగా నియమించారు. శ్రీశైల దేవస్థానం పరిధిలో అనధికారికంగా రేకుల షెడ్లతో ఇళ్ల నిర్మాణం చేయించడం, తాత్కాలిక దుకాణాలను ఒక ప్రదేశం నుంచి మరో ప్రదేశానికి మార్చడం వల్ల దేవస్థానానికి ఆర్థికంగా నష్టం వాటిల్లినట్లు ఏఈవోపై అభియోగాలు నమోదు చేశారు.

నారీ శక్తిని గుర్తించాలి

దేశ భవిష్యత్తు కోసం నారీ శక్తి అవసరం ఉందని కలెక్టర్ జి.రాజకుమారి పేర్కొన్నారు. బాలికల్లో నిద్రాణంగా ఉన్న శక్తిని వెలికితీసే బాధ్యత తల్లిదండ్రులు, గురువులపై ఉందన్నారు. అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని నంద్యాల సెంటినరీ హాల్‌లో నిర్వహించిన వేడుకలను కలెక్టర్ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. బాలికలు ఓ లక్ష్యాన్ని నిర్దేశించుకుని ఎన్ని సవాళ్లు ఎదురైనా అకుంఠిత దీక్షతో ముందుకు సాగాలని సూచించారు. ఐసీడీఎస్ పీడీ లీలావతి, వరల్డ్ విజన్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి తిరుపతిరావు, బాలికల అభివృద్ధి అధికారిణి సువర్చల, డిప్యూటీ డీఎం హెచ్‌వో శారదాబాయి, న్యాయవాది హిమబిందు, మదర్ సొసైటీ వ్యవస్థాపకుడు రామారావు, సాంఘిక సంక్షేమ అధికారిణి చింతామణి తదితరులు పాల్గొన్నారు.

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే :




విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శన

గృహోత్తర ప్రణాళిక

■ అసంపూర్తి ఇళ్ల నిర్మాణాల పూర్తికి చర్యలు
■ 'మన ఇల్లు.. మన గౌరవం' పేరుతో అవగాహన

పీఎంఏవైలో భాగంగా మంజూరైన ఇళ్ల నిర్మాణానికయ్యే ఖర్చంతా కేంద్ర ప్రభుత్వమే భరిస్తోంది.. వీటికి గత వైకాపా ప్రభుత్వం జగనన్న కాలనీల బోర్డులు తగిలించుకుంది. తామే నిధులు ఇచ్చినట్లు పెద్దఎత్తున ప్రచారం చేసుకుంది. బిల్లులు పూర్తిస్థాయిలో ఇవ్వక నిర్లక్ష్యం చేసింది. ఫలితంగా చాలామంది లబ్ధిదారులు నిర్మాణాలు మధ్యలో ఆపేశారు. గతంలో ఇంటిపని మొదలుపెట్టి పూర్తి చేయని వాటి గడువు త్వరలోనే ముగియనుంది. ఇలాంటి వారంతా భవిష్యత్తులో బిల్లులు నష్టపోతారు. కొత్త పథకానికి అర్హత ఉండదు. ఈ నేపథ్యంలో లబ్ధిదారులు నష్టపోకుండా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే :



జిల్లా	వంద రోజుల్లో పూర్తి చేయాల్సింది	రోజువారీ లక్ష్యం	గడిచిన 23 రోజుల్లో పూర్తైనవి
కర్నూలు	6,672	84	152
నంద్యాల	3,862	46	249

ఒక్కో అధికారికి రెండు కాలనీలు

"మన ఇల్లు.. మన గౌరవం" పేరిట అధికారులు లబ్ధిదారుల వద్దకు వెళ్లి అవగాహన కల్పిస్తున్నారు. ఒక్కో అధికారికి రెండు కాలనీల బాధ్యతలు అప్పగించారు.. పునాది నుంచి లెంటల్ స్థాయిలో ఉన్న ఇళ్లను ఈ ఏడాది డిసెంబరు నాటికి పూర్తి చేయాల్సి ఉంది. స్లాబు స్థాయి/ స్లాబు వేసిన వాటిని ఈ ఏడాది అక్టోబరులోగా పూర్తి చేసే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు.

ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్తేనే..

అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయించాలని కూటమి ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. జిల్లా గృహనిర్మాణ శాఖలో ఇంజినీర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు.. ఇలా అందరిని సమన్వయం చేసుకొని నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేసేలా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. ఆ దిశగా జిల్లా యంత్రాంగం తీసుకుంటున్న చర్యలు అంతంతమాత్రంగా ఉన్నాయి.

ఎప్పటికప్పుడు బిల్లుల చెల్లింపు

● ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకున్న లబ్ధిదారులకు బిల్లులను ఎప్పటికప్పుడు చెల్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని.. రూ.1,700 కోట్లను బిల్లుల చెల్లింపుల కోసం నిధులు అందుబాటులో ఉంచిందని గృహ నిర్మాణ ఇంజినీర్లు పేర్కొంటున్నారు. నిర్మాణాలు పూర్తి చేసుకొని బిల్లులు పెట్టిన వెంటనే చెల్లిచేస్తారు. కానీ ఇళ్ల నిర్మాణాల్లోనే జాప్యం జరుగుతోంది.

● వివిధ దశల్లో ఆగిన నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసేందుకు రోజువారీగా లక్ష్యాలను ప్రభుత్వం నిర్దేశించింది. లబ్ధిదారులకు స్వయం సహాయక సంఘాలు లేదా బ్యాంకర్ల ద్వారా రుణాలు మంజూరు చేయించేలా చర్యలు చేపట్టింది. పీఎంఏవైలో భాగంగా మంజూరైన నిధులను వినియోగిస్తే తప్ప కొత్త నిధులు రావు. గతంలో మంజూరైన నిధులు వచ్చే ఏడాది మార్చికల్లా వెనక్కి వెళ్లిపోతాయి.

లక్ష్యం 2,990.. పూర్తైంది 401

● అసంపూర్తిగా ఉన్న ఇళ్ల జాబితాను అధికారులు ఇప్పటికే సిద్ధం చేశారు. ఏ మండలంలో ఎన్ని ఉన్నాయన్న దానిపై సమగ్ర సమాచారం సేకరించారు. ఇందు కోసం సచివాలయానికి ఒక నోడల్ అధికారితో ప్రత్యేక బృందం ఏర్పాటుచేశారు. వీరు లబ్ధిదారులతో మాట్లాడి కారణాలు తెలుసుకుంటున్నారు. అందుబాటులో ఉన్న నిర్మాణదారులను తక్కువ ధరకు పనిచేసేలా మాట్లాడటం.. వీలైనంత తక్కువ ధరలకు సామగ్రి ఇప్పించేందుకు చర్యలు చేపట్టారు.

● ఈ ఏడాది సెప్టెంబరు 23 నుంచి డిసెంబరు 31వ తేదీ వరకు గృహ నిర్మాణ శాఖలో వంద రోజుల లక్ష్యాలు నిర్దేశించారు. వైకాపా ప్రభుత్వ హయాంలో మంజూరై.. అసంపూర్తిగా ఉన్న నిర్మాణాలు పూర్తి చేసేందుకు కార్యాచరణ ప్రణాళికలు రూపొందించారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో వంద రోజుల్లో 10,534 నిర్మాణాలు లక్ష్యంగా పెట్టుకున్నారు. గత 23 రోజుల వ్యవధిలో పురోగతి అంతంతమాత్రంగానే ఉంది.



చినుకు రాలుతోంది కునుకు కరవైంది

ఆగస్టు రెండో వారం నుంచి సెప్టెంబరు మొదటి వారం వరకు అధిక వర్షాలు పంటలకు చేటు తెచ్చాయి.. తేమ శాతం పెరిగి పంటలు దెబ్బతిన్నాయి. ఉల్లి కుళ్లిపోయింది.. మిరప రైతులు నష్టాలు మూటగట్టుకున్నారు. మొక్కజొన్న పూత రాలిపోయి గింజ కట్టని పరిస్థితి నెలకొంది. ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా 8,619.49 హెక్టార్లలో పంట నష్టం జరిగినట్లు అధికారికంగా నివేదించారు. ఉన్న కొద్దిపాటి పంట చేతికొచ్చిన దశలో అల్పపీడనం వార్తతో అన్నదాతలకు గుబులు పుట్టిస్తోంది. రాయలసీమ జిల్లాల్లో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. ఈనెల 16, 17 తేదీల్లో మరింత అప్రమత్తంగా ఉండాలని సూచనలు చేసింది. ఈ వార్త అన్నదాతలకు కంటిమీద కునుకు లేకుండా పోయింది.

కర్నూలు వ్యవసాయం, న్యూస్‌టుడే:

కల్లాల్లో దిగుబడులు

✦ కొన్ని చోట్ల ఉల్లి కోసి ఆరబెట్టుకోగా.. మరికొన్ని చోట్ల కోతకు వచ్చింది.. ఉల్లి రైతు అటు అధిక వర్షాలతో కొంత నష్టపోగా.. ప్రస్తుతం తుపాను ప్రభావంతో ఆందోళనలో మునిగిపోయారు. తేమ శాతం ఎక్కువగా ఉంటే ధర రాదు.. దిగుబడులు ఆరబెట్టుకునే పరిస్థితి లేదు. ఏమి చేయాలో తెలియక కన్నీరు ఆగడం లేదు.

✦ ప్రస్తుతం పత్తి తీత పనులు సాగుతున్నాయి. ఒక క్వింటా పత్తి తీసేందుకు కూలీ రూ.1000 ఖర్చవుతుంది. ప్రస్తుతం రెండు, మూడో తీతకు పత్తి సిద్ధంగా ఉంది.. భారీ వర్షాలు కురిస్తే చేతికి వచ్చిన పత్తి మట్టిపాలవుతుందని కర్షకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

✦ మొక్క రైతుకు బెంగ తప్పడం లేదు. నాడు పూత రాలిపోయి గింజ కట్టక కొంత నష్టపోయారు.. ప్రస్తుతం కల్లాల్లో ఆరబెట్టుకుంటే వర్షాలు ముసురుకుంటున్నాయి.. నాలుగు రోజులు ఆరబెట్టి విపణికి తీసుకెళ్దామంటే తుపాను భయపెడుతోంది. తేమ శాతం అధికంగా ఉంటే గిట్టుబాటు ధర రాని పరిస్థితి.. అటు ఆరబెట్టుకోలేక.. ఇటు విపణికి తరలించలేక అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు..

✦ గత నెలలో అధిక వర్షాల కారణంగా పంట పొలాల్లోనే కొర్ర గింజలు నేలరాలాయి. సజ్జ పంట చేతికి వస్తోంది. సోయాబీన్, మొక్కజొన్న పంటలకు సంబంధించి కోతలు అయ్యాయి.


స్వామి, అమ్మవార్లను అర్చిస్తున్న ప్రధానార్చకుడు కిడాంబి వేణుగోపాలన్

నృసింహ నామస్మరణ.. సకల పాపహరణ

అహోబిలేశుని పవిత్రోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. ఎగువ అహోబిలంలో పవిత్రోత్సవాలు శాస్త్రోక్తంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం జ్వాలా నృసింహస్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లకు ఎదురుగా హోమం నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు కిడాంబి వేణుగోపాలన్, మణియార్ సౌమ్యనారాయణన్ ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహించారు. దిగువ అహోబిలంలో నేడు పవిత్రోత్సవాలకు అంకురార్పణ జరగనుంది.

ఆళ్లగడ్డ గ్రామీణం న్యూస్‌టుడే :

ఇన్‌ఛార్జి మంత్రుల రాక సాగునిధికి ఊరట



ఈనాడు, కర్నూలు: జిల్లాలకు ఇన్‌ఛార్జి మంత్రులను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.. కర్నూలుకు జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, నంద్యాలకు ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌లును నియమించడంతో అభివృద్ధి అడుగులు వేగంగా పడే అవకాశం ఉంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులు ఎక్కువగా ఉన్నాయి.. గత వైకాపా హయాంలో చిల్లిగవ్వ ఇవ్వకపోవడంతో ఎక్కడికక్కడ నిలిచిపోయాయి.. మరో 3.23 లక్షల ఎకరాలకు నీరందించే అవకాశాలున్నా గత ప్రభుత్వం పట్టించుకోలేదు. చిన్న, సన్నకారు రైతులెక్కువగా ఉన్న కర్నూలు జిల్లాలో చాలా మంది ఒక పంటతోనే సరిపెట్టుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఇలాంటి పరిస్థితుల్లో జల వనరులు, ఆర్థిక శాఖ మంత్రులకు ఇన్‌ఛార్జి బాధ్యతలు ఇవ్వడంతో సమస్యలు చాలా వరకు పరిష్కారమయ్యే అవకాశం ఉంది. ఎలాంటి ప్రాజెక్టులకైనా ఆర్థికశాఖ ఆమోదం ఉండాల్సిందే. ఆర్థికశాఖ మంత్రి సిఫార్సులుంటే గుత్తేదారులూ పనులు వెంటనే పూర్తి చేస్తారు. బిల్లులు త్వరగా వస్తాయన్న భరోసాతో గుత్తేదారులు ఆయా పనులు పూర్తిచేయడానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తారు. పయ్యావుల కేశవ్‌ను నంద్యాల జిల్లా ఇన్‌ఛార్జి మంత్రిగా నియమించడంతో ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాజెక్టులకు అడ్డంకిగా మారిన ఆర్థిక సమస్యలు తొలగిపోయినట్లేనని పలువురు అభిప్రాయపడుతున్నారు.

వీటిపై దృష్టి సారించాలి

- వేదవతి, ఆర్డీఎస్ ప్రాజెక్టుల పనులు 10 శాతం కూడా పూర్తికాలేదు.
- 20 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించాలని ప్రతిపాదించిన గుండ్రేవులను గత ప్రభుత్వం వదిలేసింది.
- సుంకేసుల గేట్లు దెబ్బతిన్నా తాత్కాలిక మరమ్మతులతో సరిపెట్టారు.
- కేసీ కాల్వ మరమ్మతులకు రూ.536 కోట్ల వ్యయం అవుతుందని అధికారులు అంచనా వేసినా పట్టించుకోలేదు.
- హంద్రీనీవా పంట కాల్వలు పూర్తి చేయలేదు. ఫలితంగా 40వేల ఎకరాలకు నీరందని పరిస్థితి నెలకొంది.
- ఆధునికీకరణ పేరుతో గాజులదిన్నె జలాశయాన్ని చిదిమేశారు.
- రెండు తెలుగు రాష్ట్రాలకు అతిముఖ్యమైన శ్రీశైలం జలాశయం ముందు ఏర్పడ్డ గొయ్యిని పూడ్చలేకపోయారు.
- నిర్వహణలేక గోరుకల్లుకు ప్రమాదం పొంచి ఉంది.

ఘనులపై ఉక్కుపాదం



గనుల ఖిల్లా డోన్ ప్రాంతంలో గత ఐదేళ్లు వైకాపా ముఖ్య నేతలు, వారి అనుచరులు గనులను మింగేశారు. అడ్డగోలుగా తవ్వేసి అందినకాడికి దండుకొన్నారు. 'కూటమి' ప్రభుత్వం అధికారంలో వచ్చి నాలుగు నెలలు దాటినా కొందరు 'ఘనులు' నేటికీ అక్రమ దందా కొనసాగిస్తున్నారు.. వీటిపై ఫిర్యాదులు వెల్లువెత్తడంతో స్థానిక ఎమ్మెల్యే గనులశాఖ అధికారులను, పోలీసులను అప్రమత్తం చేశారు. దీంతో అక్రమార్కులపై అధికారులు ఉక్కుపాదం మోపుతున్నారు. గత రెండు నెలల కాలంలో ఏకంగా 17 మందిపై కేసులు చేయడం గమనార్హం. ఏఏ గనుల్లో ఎంతెంత పరిమాణాన్ని అక్రమంగా తవ్వేశారో లెక్కలు తీస్తున్నారు.

ఈనాడు, కర్నూలు, డోన్, న్యూస్‌టుడే:

లోతుగా తవ్వేస్తున్నారు

● గనుల్లో 3 మీటర్ల నుంచి 9 మీటర్ల వరకు బెంచ్ కటింగ్ చేపట్టాలి. ఎక్కడా ఈ నిబంధన అమలు కావడం లేదు. 60 నుంచి 100 అడుగుల లోతుల్లో తవ్వకాలు చేపడుతున్నారు. దీనివల్ల పైప్రాంతం పగుళ్లు వచ్చి ఎప్పుడు కూలిపోతాయో తెలియని పరిస్థితి నెలకొంది. బెంచ్ కటింగ్ పద్ధతిని విస్మరించి తవ్వకాలు చేపట్టినచోట పైభాగం కూలిపోయి రాళ్లు పడి పలువురు మృతి చెందిన ఘటనలున్నాయి.

● గనుల కింది భాగంలో ట్రాక్టర్ల కంప్రెషర్ల ద్వారా పేలుడు పదార్థాలతో తవ్వుతున్నారు. దీంతో గ్రామంలో ఇళ్లు బీటలు బారుతున్నాయి. 'బీ' విభాగం కిందకొచ్చే ఖనిజాలకు బ్లాస్టింగ్‌కు అనుమతులు లేకపోయినా పేలుళ్లు సాగిస్తున్నారు.

● కొందరి లీజు గడువు ముగిసింది. వైకాపా ముఖ్యనేతల అండదండలు ఉండటంతో లోతుగా తోడేశారు. లీజులు ఒకచోట ఉండగా.. తవ్వకాలు మరోచోట చేపడుతున్నారు. దీనివల్ల ప్రభుత్వ ఆదాయానికి రూ.కోట్లలో గండి పడుతోంది.

ఎనిమిది మందికి తాఖీదులు

ప్యాపిలి, డోన్ మండలాల్లో ఎనిమిది మందికి సంబంధించిన క్వారీల్లో తనిఖీలు చేశారు. పరిమితికి మించి తవ్వేశారని నిర్ధారించారు. వారికి నోటీసులు ఇచ్చారు. అనుమతులు తీసుకున్నచోట కాకుండా ఆయా పరిమితులను అడ్డం పెట్టుకుని వేరేచోట్ల తవ్వకాలు సాగించినట్లు నిర్ధారించారు. నోటీసులు అందుకున్న ఆ ఎనిమిది మంది వైకాపాకు చెందినవారే. డోలమైట్, మెజాయిక్ చిప్స్, వైట్ షేల్, పరిశ్రమలకూ తాఖీదులు ఇచ్చారు.

తెల్ల సుద్దను మింగేశారు

● ఉమ్మడి కర్నూలు జిల్లాలో బనగానపల్లి, అవుకు, కొలిమిగుండ్ల, బేతంచెర్ల, పాణ్యం, డోన్, ప్యాపిలి, కృష్ణగిరి, వెల్దుర్తి, ఓర్వకల్లు, సి.బెళగల్ తదితర మండలాల్లో గనులు ఉన్నాయి. ఒక్క నంద్యాల జిల్లా పరిధిలోనే వెయ్యి వరకు క్వారీలు ఉన్నాయి. డోన్ నియోజకవర్గ పరిధిలో చిన్నమల్కాపురం, పెద్దమల్కాపురం, జలదుర్గం, కొచ్చెర్వు, బావిపల్లె, చంద్రపల్లె ప్రాంతాల్లో డోలమైట్, లైమ్‌స్టోన్, వైట్ షేల్, స్టీటైట్, వైట్‌క్లే, తెల్ల సుద్ద వంటి ఖనిజాలు ఎక్కువగా ఉన్నాయి.

● ప్యాపిలి మండలం బావిపల్లి, డోన్ మండలం చిన్నమల్కాపురం, బేతంచెర్ల మండలంలోని పలు గ్రామాల్లో వైట్ షేల్(సుద్ద)పై అక్రమార్కులు లక్ష్యంగా చేసుకొన్నారు. నిత్యం వందకు పైగా టిప్పర్లు తిరిగినట్లు అధికారులు గుర్తించారు. గనుల నుంచి అనుమతులు లేకుండా సరకు తరలిస్తున్న వాహనాల నుంచి ఏకంగా రూ.10 లక్షల వరకు అపరాధ రుసుములు వసూలు చేశారంటే అక్రమ రవాణా ఏస్థాయిలో జరుగుతుందో అర్థం చేసుకోవచ్చు.

● సుద్ద రాయికి టన్నుకు కేవలం రూ.వంద నుంచి రూ.130ల ధర పలుకుతుంది. నిత్యం డోన్ నియోజకవర్గంలో వివిధ ప్రాంతాల నుంచి వంద వరకు టిప్పర్లలో ఇష్టారాజ్యంగా తరలించేశారు.

నేడు శ్రీశైలం గేట్లు ఎత్తనున్న అధికారులు

■ ఈ సీజన్‌లో ఐదోసారి

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే: శ్రీశైలం జలాశయం గేట్లను అధికారులు బుధవారం పైకెత్తి నీటిని దిగువకు విడుదల చేయనున్నారు. ఎగువ పరీవాహక ప్రాంతాల నుంచి వరద భారీగా వస్తుండటంతో ఒకటి లేదా రెండు గేట్లను ఎత్తి నీటిని విడుదల చేయనున్నట్లు పర్యవేక్షక ఇంజినీర్ శ్రీరామచంద్రమూర్తి మంగళవారం తెలిపారు. ఎగువ ప్రాంతాల నుంచి 1,23,314 క్యూసెక్కుల ప్రవాహం శ్రీశైలానికి వస్తోంది. మంగళవారం 6 గంటల సమయానికి శ్రీశైలం జలాశయం నీటి మట్టం 883.90 అడుగులు (గరిష్ఠం 885 అడుగులు). ప్రస్తుత నీటి నిల్వ సామర్థ్యం 209.1579 టీఎంసీలు (గరిష్ఠం 215.807 టీఎంసీలు).

అల్పపీడనం అధికారుల అప్రమత్తం

■ కలెక్టరేట్‌లో కమాండ్ కంట్రోల్ రూం

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా భారీ వర్షాలు కురుస్తాయన్న సమాచారం నేపథ్యంలో నంద్యాల కలెక్టరేట్‌లో జిల్లా కమాండ్ కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. కంట్రోల్ రూంలో 08514- 293903, 08514- 293908 ఫోన్ నంబర్లు 24 గంటల పాటు అందుబాటులో ఉంటాయని అధికారులు తెలిపారు. సిబ్బంది మూడు షిఫ్టుల్లో విధులు నిర్వర్తిస్తారని వెల్లడించారు.

లోపలి పేజీల్లో

అల్పపీడన ప్రభావం.. అప్రమత్తతతో నష్టాలు దూరం

కళలు అల్లుకుని.. భవిష్యత్తు అందుకోవాలని 6లో

ఈ-శ్రమ్ కార్డులు.. కార్మికులకు వరం



అసంఘటిత రంగ కార్మికులకు కేంద్రం వివిధ పథకాలు అందజేస్తోంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 40 లక్షలకు పైగా జనాభా ఉండగా, అసంఘటిత రంగ కార్మికులు సుమారు 8 లక్షల నుంచి 10 లక్షల వరకు ఉంటారని అంచనా. ఇందులో కర్నూలు, నంద్యాల జిల్లాలో ఇప్పటివరకు ఈ-శ్రమ్ కింద 6.16 లక్షల మంది రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారు. వీరికి యూనివర్సల్ ఐడెంటిఫికేషన్ నంబరు (యూఏఎన్) వస్తుంది. ఈ-శ్రమ్ కింద నమోదు చేసుకున్న వారు ఏదైనా అనుకోని ప్రమాదం జరిగి ప్రమాదంలో మరణిస్తే రూ.2 లక్షల వరకు ప్రమాద బీమా వర్తిస్తుందని అధికారులు చెబుతున్నారు.

– న్యూస్‌టుడే, డోన్

నమోదుకు కావాల్సినవి ఇవీ..

- ఈకేవైసీ కలిగిన ఆధార్ ఉండాలి.
- ఆధార్‌తో అనుసంధానమైన చరవాణి నంబరు
- ఆధార్ నంబరు నమోదు చేయగానే మొబైల్‌కు ఓటీపీ వస్తుంది.
- ఓటీపీ సదుపాయం లేకపోతే బయోమెట్రిక్ ఫింగర్‌ప్రింటు, ఐరిస్, బ్యాంకుఖాతా, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ వివరాలతో సమీపంలోని కస్టమర్ సర్వీస్ సెంటర్‌లో నమోదు చేసుకోవాలి. నమోదు చేసుకుంటే యూఏఎన్ కార్డు జారీ చేస్తారు.
- 16 నుంచి 59 ఏళ్లలోపువారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఆదాయపు పన్ను చెల్లించనివారు, ఈపీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం లేని వారు అర్హులని గుర్తించాలి.

ఎవరెవరంటే..?

కుట్టు, ఎంబ్రాయిడరింగ్, డ్రెస్‌మేకర్స్, డ్రైవర్లు, హెల్పర్లు, చేనేత, కుమ్మరి, స్వర్ణకారులు, కమ్మరి, క్షౌర వృత్తి, బ్యూటీపార్లర్‌లో పనిచేసే వారు, రజకులు, వీధి వ్యాపారులు, తోపుడుబండి వ్యాపారులు, చిరు వ్యాపారులు, కల్లుగీత కార్మికులు, రిక్షా కార్మికులు, బీడీ కార్మికులు, ఎన్ఆర్ఈజీఎస్, ఆశా వర్కర్లు, ఎస్‌హెచ్‌జీ సంఘాల మహిళలు, అంగన్‌వాడీలు, మధ్యాహ్న భోజన కార్మికులు, హమాలీలు, లోడింగ్, అన్‌లోడింగ్ కార్మికులు ఈ-శ్రమ్‌కార్డులకు దరఖాస్తు చేయొచ్చు.

ఎనిమిది మందికి బీమా

ఈ-శ్రమ్‌లో నమోదు చేసుకున్న వారు ప్రమాదం జరిగిన వెంటనే సమీపంలోని కస్టమర్ సర్వీస్ సెంటర్‌లో వివరాలు నమోదు చేసుకోవాలి. ఇలా నమోదు చేసుకున్న దరఖాస్తులు డీఆర్‌డీఏ పీడీ కార్యాలయానికి వెళ్తాయి. అక్కడి నుంచి వివరాలన్నింటిపై విచారణ చేసి కలెక్టర్ అనుమతికి పంపుతారన్నారు. ఇలా ఎవరైనా ఈ-శ్రమ్ కార్డు ఉండి ప్రమాదం జరిగితే నమోదు చేసుకోవచ్చు. నంద్యాల జిల్లాలో ఎనిమిది మందికి ప్రమాద బీమా సాయం అందించినట్లు నంద్యాలజిల్లా కార్మికశాఖ అధికారిణి బషీరున్నీషాబేగం తెలిపారు.

అల్పపీడన ప్రభావం.. అప్రమత్తతతో నష్టాలు దూరం



ఉద్యాన రైతులూ.. ఇవి పాటించండి

అల్పపీడన ప్రభావం కారణంగా భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఇప్పటికే ఆకాశం మేఘావృతమై ఉంది. ఈ నేపథ్యంలో ఉద్యాన రైతులు పలు జాగ్రత్తలు తీసుకోవాలి. పంటలను కాపాడుకునేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలి. అప్పుడే నష్టాన్ని నివారించుకునే అవకాశముంటుంది.

ఉల్లి కోతలు కోయొద్దు

కోతకు సిద్ధంగా ఉన్న ఉల్లిని వర్షాలు ఆగేవరకు కోతలు కోయకూడదు. ఒకవేళ కోసి ఉంటే త్వరితగతిన మార్కెట్‌కు తరలించాలి. లేదా పట్టలతో కప్పి తడవకుండా చూసుకోవాలి. పొలంలో నీరు నిలిస్తే మొక్కలు కుళ్లిపోయే అవకాశముంది. ఈ నేపథ్యంలో ఎప్పటికప్పుడు నీరు బయటకు వెళ్లేలా చూడాలి. ఉల్లి గడ్డ దెబ్బతినకుండా ఉండేందుకు రిడోమిల్ గోల్డ్ 3 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. కొత్తగా నారు నాటేవారు వర్షాలు ఆగిపోయిన తర్వాత నాటుకోవాలి.

అరటి, బొప్పాయిలో జాగ్రత్తలు ఇలా..

- పెనుగాలులతో కూడిన వర్షం కారణంగా గెలలు ఉన్న అరటి చెట్లు పడిపోయే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. అరటి చెట్లు పడిపోకుండా కట్టెల సాయంతో ముందు జాగ్రత్తగా ఊతమివ్వాలి. కోతకు వచ్చిన గెలలను ముందుగానే కోత కోసి అమ్ముకోవాలి.
- బొప్పాయిలో కోతకు సిద్ధంగా ఉన్నవాటికి ముందుగానే కోత కోసి విక్రయించుకోవాలి. కోతకు వచ్చిన పండ్లను సరైన రీతిలో ప్యాకింగ్ చేసి ప్యాక్ హౌస్‌లల్లో నిల్వ ఉంచుకోవాలి. ఫలితంగా నష్టాన్ని కొంతమేర అధిగమించవచ్చు. - న్యూస్‌టుడే, కర్నూలు సచివాలయం

టమాటలో మచ్చ తెగులు

వర్షం కురిసే సమయంలో టమాట కోతలు కోయకూడదు. వర్షం రాకముందే కోత కోసి విపణికి తరలించి విక్రయించుకోవాలి. కోతకి సిద్ధంగా ఉన్నవాటిని కోసి సరైన గాలి ప్రసరించే ప్రదేశంలో నిల్వ చేసుకోవాలి. అధిక వర్షాల కారణంగా మచ్చ తెగులు ఆశించకుండా ముందు జాగ్రత్త చర్యగా 2.5 గ్రాముల ఎం.45 ఒక గ్రాము కార్బెండిజిమ్‌ను లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి. పండ్లు, కూరగాయల తోటల రైతులు అప్రమత్తంగా ఉండి పంటలను సంరక్షించుకోవాలి.

ఉరుముతున్న మేఘం.. అన్నదాతల్లో భయం



మొక్కజొన్నలను కాపాడుకునే ప్రయత్నం



జిల్లాలో ఖరీఫ్‌లో సాగుచేసిన మొక్కజొన్న, సోయాబీన్ పంటలను రైతులు నూర్పిడి చేసి దిగుబడులను ఆరబెట్టుకుంటున్నారు. మంచి ధర వస్తే విక్రయించాలని ఎదురు చూస్తున్నారు. ఈ సమయంలో అల్పపీడన ప్రభావంతో మేఘాలు ముసురుకోవడంతో కర్షకులు కలవరం చెందుతున్నారు. దిగుబడులు తడిసిపోతే పెట్టుబడులు కూడా రావని భయపడుతున్నారు. ఆరుగాలం కష్టించి పండించిన దిగుబడులను కాపాడుకునేందుకు ఆరాటపడుతున్నారు. నంద్యాల టెక్కె మార్కెట్‌యార్డులో పలువురు రైతులు మంగళవారం సోయాబీన్, మొక్కజొన్న దిగుబడులను ఆరబోశారు. అంతలోనే చినుకులు పడటంతో వాటిపై పట్టలు కప్పారు.

– న్యూస్‌టుడే, నంద్యాల బొమ్మలసత్రం



ఎస్.నాగులవరంలో పనులు ప్రారంభిస్తున్న మంత్రి ఫరూక్

రూ.7 కోట్లతో అభివృద్ధి పనులు

ఎస్.నాగులవరం (గోస్పాడు), న్యూస్‌టుడే : నంద్యాల నియోజకవర్గానికి రూ.7 కోట్లతో అభివృద్ధి పనులు మంజూరయ్యాయని న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ తెలిపారు. గోస్పాడు మండలం ఎస్.నాగులవరంలో మంగళవారం నిర్వహించిన పల్లె పండగ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పలు అభివృద్ధి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గ్రామాల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అన్ని రకాల సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీడీవో అమానుల్లా, ఈవోఆర్డీ నాగఅనసూయ, తెదేపా నాయకులు కాటంరెడ్డి తులసీశ్వరరెడ్డి, వేమారెడ్డి, సుధాకర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

జీవీమాల్ లక్కీ డ్రా విజేతకు కారు



జీవీమాల్‌లో లక్కీ డిప్ తీస్తున్న మంత్రి ఎన్ఎండీ ఫరూక్

నంద్యాల పాతపట్టణం, న్యూస్‌టుడే : దసరా పండగ సందర్భంగా నంద్యాల పట్టణంలోని జీవీ మాల్ ఆధ్వర్యంలో 'నవ రాత్రులు- జీవీ కానుకలు' పేరుతో నిర్వహించిన లక్కీడ్రాలో విజేతకు కారును బహుమతిగా అందజేశారు. స్థానిక మాల్‌లో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర న్యాయ, మైనారిటీ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ లక్కీ డ్రా తీశారు. ఇందులో నంద్యాలకు చెందిన శాంతిసాగర్ మారుతీ వ్యాగనార్ కారును దక్కించుకున్నారు. మంత్రి మాట్లాడుతూ నంద్యాల ప్రజలు పెద్ద పెద్ద నగరాలకు వెళ్లే అవసరం లేకుండా స్థానికంగానే వస్త్ర మాల్ అందుబాటులోకి రావడంతో పాటు మంచి ఆఫర్లు, బహుమతులు ఇవ్వడం హర్షణీయమన్నారు. నంద్యాల క్లాత్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు వేణుగోపాల్, న్యాయవాది తులసిరెడ్డి, మాల్ సిబ్బంది పాల్గొన్నారు.

టెట్‌కు 21 మంది గైర్హాజరు

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే : మండలంలోని ఆర్జీఎం ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం నిర్వహించిన ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)కు 21 మంది గైర్హాజరైనట్లు ఎంఈవో2 సుబ్రహ్మణ్యం తెలిపారు. ఉదయం 60 మంది అభ్యర్థులకు 49 మంది, మధ్యాహ్నం వందమందికి గాను 90 మంది పరీక్షలు రాసినట్లు వెల్లడించారు.

కేసీ కాల్వ డీఈఈ బదిలీ

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : నంద్యాల కేసీ కాల్వ డీఈఈ సుబ్రహ్మణ్యంరెడ్డి బదిలీ అయ్యారు. ఈయన్ను తెలుగుగంగ సబ్ డివిజన్-3కి బదిలీ చేస్తూ ఈఎన్‌సీ కె.శ్రీనివాస్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన స్థానంలో ఆళ్లగడ్డ కేసీ కాల్వ డీఈ రవీంద్రకు అదనపు బాధ్యతలు అప్పగించారు.

ఎన్టీఆర్ శిలాఫలకాన్నే కాలువలో పడేస్తారా?

- విజయ డెయిరీ ఛైర్మన్‌పై ఎమ్మెల్యే అఖిలప్రియ ఆగ్రహం



శిలాఫలకానికి క్షీరాభిషేకం చేస్తున్న ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

నంద్యాల వ్యవసాయం, న్యూస్‌టుడే : దివంగత నేత, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు పేరుతో ఉన్న శిలాఫలకాన్నే కాలువలో పడేస్తారా.. అసలు విజయ డెయిరీలో ఏం జరుగుతోందని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ఆగ్రహం వ్యక్తం చేశారు. 1983లో అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్ నంద్యాలలో పాల ఉత్పత్తుల కర్మాగారాన్ని ప్రారంభించిన సందర్భంగా ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ప్రస్తుతం తొలగించి కాలువపై వేయడంపై ఆమె స్పందించారు. నంద్యాలలోని విజయ డెయిరీకి మంగళవారం వెళ్లారు. అక్కడ తొలగించి కాలువలో పడేసిన శిలాఫలకానికి క్షీరాభిషేకం చేశారు. ఎండీ కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఫొటో ఉండటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రొటోకాల్ ప్రకారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, సంబంధిత శాఖ మంత్రి అచ్చెన్నాయుడు చిత్రపటాలు ఉండాలని, అందుకు విరుద్ధంగా మాజీ సీఎంలు జగన్, రాజశేఖర్‌రెడ్డితో పాటు గంగుల వాళ్ల ఫొటోలు ఎలా పెడతారని అధికారులను నిలదీశారు. కార్యాలయంలో ఫొటోలను తొలగించి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చిత్రపటాన్ని ఏర్పాటు చేశారు. ఇక్కడ సీసీ కెమెరాలు లేవు, శిలాఫలకాన్ని ఎవరు పగులగొట్టారో అడిగితే జవాబు లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని కలెక్టర్, ఎస్పీ తీసుకెళ్లామన్నారు. ఈసందర్భంగా అఖిలప్రియ విజయ డెయిరీ ఛైర్మన్ కార్యాలయంలో ఆయన కుర్చీలో కూర్చొని ఉండగా ఛైర్మన్ ఎస్వీ జగన్‌మోహన్‌రెడ్డి ఆమెకు ఫోన్ చేశారు. ఈ సందర్భంగా ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది.

కళలు అల్లుకుని.. భవిష్యత్తు అందుకోవాలని

- స్వయం ఉపాధిలో మెలకువలు

జీవితంలో స్థిరపడేలా..

ఆదోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో చదువుతున్న పదో తరగతి విద్యార్థినుల కోసం కేంద్ర ప్రభుత్వం స్వయం ఉపాధికి అవసరమైన ఎంబ్రాయిడరీ, మిషన్ కుట్టుట, అల్లికలు, ఫ్యాషన్ డిజైనింగ్‌పై ఈ నెల 3వ తేదీన ఆదోని పట్టణంలో విద్యార్థినులకు ప్రత్యేక శిక్షణ ప్రారంభించారు. ఏఐఎస్ఈసీటీ సంస్థ శిక్షకులు విద్యార్థినులకు మెలకువలు నేర్పుతున్నారు. ప్రధానంగా ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సుకు సంబంధించి పలు అంశాలను ప్రయోగాత్మకంగా నేర్పుతున్నారు. ఈ కోర్సుల్లో రాణించడం, స్వయం ఉపాధి వైపు ఎలా అడుగులు వేయాలి? తదితర అంశాలపై అవగాహన కూడా కల్పిస్తున్నారు. స్వయం ఉపాధితో తమ కాళ్లపై తామే నిలబడాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టారు.

పుస్తకాల్లోని పాఠాలే కాదు.. భవిష్యత్తును ఉత్తమంగా తీర్చిదిద్దుకునేలా కళలపై దృష్టిసారిస్తోంది ప్రభుత్వం. స్వయం ఉపాధికి అవసరమైన అల్లికలు, ఎంబ్రాయిడరీ, ఫ్యాషన్ డిజైనింగ్ రంగంలో రాణించేందుకు వీలుగా కేంద్ర ప్రభుత్వం రాష్ట్రీయ మాధ్యమిక శిక్ష అభియాన్ పథకం కింద విద్యార్థినులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం చేపట్టింది. ఆదోని పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థినులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. ఏఐఎస్ఈసీటీ సంస్థకు చెందిన శిక్షకులు మెలకువలు నేర్పుతున్నారు. – న్యూస్‌టుడే, ఆదోని విద్య



ఆదోనిలో కుట్లు, అల్లికలపై విద్యార్థినులకు శిక్షణ

ప్రత్యేక శిక్షణ ఇస్తున్నాం - వెంకటగౌరి, శిక్షకురాలు



కేంద్ర ప్రభుత్వం రాష్ట్రీయ మాధ్యమిక శిక్ష అభియాన్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థినులకు స్వయం ఉపాధిపై ప్రత్యేకంగా శిక్షణ ఇస్తున్నాం. అల్లికలు, మిషన్ కుట్టడం, మగ్గం వర్క్, ఎంబ్రాయిడరీ తదితర వాటిపై ప్రత్యేక శిక్షణ ఇవ్వడంతో పాటు స్వయం ఉపాధి వల్ల కలిగే లాభాలు తదితర అంశాలపై విద్యార్థినులకు వివరిస్తున్నాం. ఒక్కో విద్యార్థినికి శిక్షణ కాలంలో రూ.500 నుంచి రూ.వేయి వరకు ప్రోత్సాహక భృతి అందిస్తున్నాం. చాలా మంది ఆసక్తి కనబరుస్తున్నారు. చదువుకు ఎలాంటి ఇబ్బందులు ఉండవు.

ఈ కోర్సు ఎంతో ఉపయోగకరం - గీతిక, పదో తరగతి, ఆదోని



ఉపాధిపై శిక్షణ కార్యక్రమం ఎంతో ఉపయోగకరంగా ఉంది. అందరూ ఉద్యోగాల కోసం చూడకుండా.. ఇలాంటివి నేర్చుకుంటే స్వయం ఉపాధి వైపు అడుగులేయవచ్చు. దసరా పండగ సెలవుల్లో ఎక్కువ సమయం కేటాయించాను. ఫ్యాషన్ డిజైనింగ్, అల్లికల్లో మెలకువలు నేర్చుకున్నా. ఇంట్లో ప్రయోగాలు కూడా చేశా. నేను చేసిన కొన్ని అల్లికలు అమ్మానాన్నకు చూపించా. వారు కూడా శిక్షణతో ప్రయోజనం ఉందనే అభిప్రాయానికి వచ్చారు. భవిష్యత్తులో ఉపయోగపడుతుందని ప్రోత్సహిస్తున్నారు.

అండగా ఉంటుందని - వర్షిత, విద్యార్థిని, ఆదోని



శిక్షకులు చెప్పే అంశాలు జీవితంలో అండగా ఉంటాయనేది అభిప్రాయం. స్వయం ఉపాధి కోర్సు భవిష్యత్తుకు ఎంతగానో ఉపయోగపడుతుంది. వాస్తవానికి ప్రస్తుతం దుస్తులు కుట్టడం, ఫ్యాషన్ డిజైనింగ్‌కు మార్కెట్‌లో మంచి గిరాకీ ఉంది. అలాంటిది ప్రభుత్వం ఉచితంగా నేర్పుతుండటం మాకు దక్కిన అవకాశం. శిక్షణ సమాచారం తెలిసిన వెంటనే వచ్చి చేరాం. భవిష్యత్తులో మంచి ఉద్యోగం రాకపోయినా.. భయపడకుండా ఇలాంటి స్వయం ఉపాధి కోర్సుల్లో రాణిస్తే ఆదాయ మార్గం ఉంటుంది. విద్యార్థినులకు ఉపయోగకరం.

ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన రాష్ట్ర డిప్యూటీ డైరెక్టర్



డాక్టర్ ప్రియాంకతో మాట్లాడుతున్న డిప్యూటీ డైరెక్టర్ రామనాథరావు

బేతంచెర్ల న్యూస్‌టుడే : బేతంచెర్ల ప్రభుత్వ ఆసుపత్రిని రాష్ట్ర వైద్య శాఖ డిప్యూటీ డైరెక్టర్ రామనాథరావు, జిల్లా మలేరియా అధికారి కామేశ్వరరావు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సామాజిక ఆరోగ్య కేంద్రంలో ల్యాబ్‌ను సందర్శించడంతో పాటుగా పలు రకాల రికార్డులను పరిశీలించారు. అనంతరం పట్టణంలోని అర్బన్ హెల్త్ సెంటరు-3 సందర్శించి అక్కడ రోగులకు అందుతున్న సేవలను, సిబ్బంది పనితీరును డాక్టర్ ప్రియాంకను అడిగి తెలుసుకున్నారు. కోటపేటలో డెంగ్యూ కేసును పరిశీలించి దోమ లార్వాలను పారబోయించారు.

ట్రామా సెంటర్ ఎప్పుడో..?

- 40వ జాతీయ రహదారి పరిధిలో ప్రమాదం జరిగితే 30 నుంచి 65 కి.మీ ప్రయాణించాల్సిందే

1 ఆళ్లగడ్డకు చెందిన 18 ఏళ్ల యువకుడు గతేడాది అక్టోబరు 24న రహదారి ప్రమాదంలో గాయపడ్డారు. పక్కటెముకలు విరగడంతో రక్తస్రావం ఎక్కువవ్వడంతో ఆళ్లగడ్డ సీహెచ్‌సీలో చికిత్సకు అందుబాటులో లేక 108లో నంద్యాలకు తరలించారు. ఈ క్రమంలో రెండు గంటలు వృథా కావడంతో నంద్యాల ఆసుపత్రిలో చికిత్స ప్రారంభించిన వెంటనే ప్రాణాలొదిలారు.

2 ఆళ్లగడ్డకు చెందిన మాబు షరీఫ్ ఆర్.పాంపల్లె వద్ద ద్విచక్ర వాహనంపై నుంచి కింద పడటంతో తలకు గాయాలయ్యాయి. అత్యవసర చికిత్స అవసరం కావడంతో 5 కి.మీ. దూరంలో ఆళ్లగడ్డ సీహెచ్‌సీకి కాకుండా 45 కి.మీ. దూరంలో ఉన్న నంద్యాల ట్రామా సెంటర్‌కు తరలించారు. ప్రమాదం జరిగిన గంటన్నర తర్వాత చికిత్స ప్రారంభించగా, పరిస్థితి విషమించడంతో చనిపోయారు. భార్యతో పాటు రెండేళ్ల కుమారుడు పెద్దదిక్కులేని వారయ్యారు.



గాయపడిన వారిని నంద్యాలకు తరలిస్తున్న వైనం (పాత చిత్రం)

ఇలా ఏటా పదుల సంఖ్యలో ప్రాణాలొదులుతున్నారు. జాతీయ రహదారిపై ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆళ్లగడ్డ నియోజకవర్గ పరిధిలో అత్యధికంగా 50 కి.మీ. పొడవునా 40వ జాతీయ రహదారి ఉంది. తరచూ రహదారి ప్రమాదాల్లో క్షతగాత్రులైన వారికి అత్యవసర వైద్యం అందించాలి. ఇంతటి కీలకమైన పొడవైన రహదారిపై అత్యవసర వైద్యం అందించే కీలక ట్రామా సెంటర్ విభాగం లేకపోవడంతో సరైన సమయానికి వైద్యం అందక చాలామంది ప్రాణాలొదులుతున్నారు. జిల్లాలో నంద్యాలలో తప్ప ఎక్కడా ట్రామాకేర్ లేకపోవడంతో క్షతగాత్రులు ప్రాణాలొదులుతున్న పరిస్థితులు తలెత్తుతున్నాయి. వైకాపా ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో కూటమిపైనే క్షతగాత్రులు ఆశపడుతున్నారు. – న్యూస్‌టుడే, ఆళ్లగడ్డ

జాతీయ రహదారిపై...

నంద్యాల జిల్లా పరిధిలో చాగలమర్రి వద్ద జాతీయ రహదారి 40 ప్రారంభమవుతుంది. జాతీయ రహదారిలో ప్రమాదాలేమైనా జరిగితే క్షతగాత్రులను చాగలమర్రి, ఆళ్లగడ్డ ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యానికి నంద్యాల ట్రామా కేంద్రానికి తరలిస్తుంటారు. క్షతగాత్రులకు ఎంత త్వరగా వైద్యం అందితే అంతగా వారి ప్రాణాలను రక్షించుకోవచ్చు. ట్రామా కేంద్రం ఆళ్లగడ్డలో లేకపోవడంతో క్షతగాత్రులకు వైద్యం అందాలంటే కనీసం గంటన్నర నుంచి రెండు గంటలు పడుతుంది.

కేంద్రం వస్తే ఎంతో మేలు

ట్రామా కేంద్రం వస్తే ఇద్దరేసి చొప్పున జనరల్ సర్జన్లు, ఆర్థోపెడిక్ సర్జన్లు, మత్తు వైద్యులు అందుబాటులో ఉంటారు. సహాయక సేవలు అందించేందుకు మూడు షిఫ్టుల్లో ఆరేసి మంది చొప్పున సిబ్బందిని నియమిస్తారు. అధునాతమైన ఆపరేషన్ థియేటర్, ఎక్స్-రే, సీటీ స్కాన్ సౌకర్యం అందుబాటులో ఉంటుంది. అటు వైద్యులు, ఇటు వైద్య పరికరాలు అందుబాటులో ఉండటంతో ఆళ్లగడ్డ సీహెచ్‌సీలో క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించి వారి ప్రాణాలను కాపాడే వీలుంటుంది.

ఎమ్మెల్యే చొరవ తీసుకుంటే...

ఆళ్లగడ్డలో ట్రామా కేంద్రం ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన మూడేళ్ల నుంచి వస్తోంది. అది ఇంకా ప్రతిపాదనల దశలోనే ఉంది. ఆళ్లగడ్డలో ట్రామా కేంద్రం ఏర్పాటు సాధ్యాసాధ్యాలపై నివేదిక పంపాలని సూచించగా ఏడాది కిందట వైద్య ఆరోగ్య శాఖ అన్ని వివరాలతో నివేదికను పంపించింది. ఆళ్లగడ్డలో ట్రామా సెంటర్ ఏర్పాటుకు కట్టుబడి ఉన్నానని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ హామీ ఇచ్చారు.

ఆళ్లగడ్డలో జాతీయ రహదారి పొడవు	రోజు రహదారిపై ప్రయాణించే వాహనాలు	ఆటోలు	గత ఏడాది ప్రమాదాలు	క్షతగాత్రులు
50 కి.మీ	7500	250	122	178

కేసీ కాలువలో యువకుని శవం లభ్యం

జూపాడుబంగ్లా, న్యూస్‌టుడే: మండలంలోని తరిగోపుల సమీపంలో కేసీ కాలువలో సోమవారం రాత్రి ఓ యువకుని శవం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పగిడ్యాల మండలం బీరవోలుకు చెందిన రవికుమార్(24) అనే యువకుడు ఈ నెల 12న రాత్రి భోజనం చేసి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. బంధువులు అతని ఆచూకీ కోసం గాలిస్తుండగా కేసీ కాలువలో శవాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని బయటకు తీసి శవపరీక్ష నిమిత్తం నందికొట్కూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అతని తల్లి మరియమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై లక్ష్మీనారాయణ తెలిపారు.

వైద్య సేవల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

గడివేముల, న్యూస్‌టుడే : వైద్య సేవలు అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌వో డా.వెంకటరమణ హెచ్చరించారు. గడివేముల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. తిరుపాడు గ్రామంలో జరుగుతున్న ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని పరిశీలించారు. మహిళలు, గర్భిణులు, చిన్నపిల్లలకు సరైన వైద్యం అందించాలని సిబ్బందికి సూచించారు. వారి పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సిబ్బందిని హెచ్చరించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ల్యాబ్, మందులను పరిశీలించారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్యాధికారి కిరణ్‌కు ఆదేశించారు.



ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో డా.వెంకటరమణ

నంద్యాల

•నంద్యాల • నందికొట్కూరు • శ్రీశైలం • పాణ్యం

శ్రీశైలంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు



ట్రాఫిక్ బూత్‌ను ప్రారంభిస్తున్న డీఎస్పీ

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే: శ్రీశైల మహాక్షేత్రంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు చేపట్టినట్లు ఆత్మకూరు డీఎస్పీ రామాంజినాయక్ తెలిపారు. శ్రీశైలంలో నూతనంగా ఏర్పాటు చేసిన పోలీసు ట్రాఫిక్ బూత్‌లను మంగళవారం ఆయన ప్రారంభించారు. క్షేత్ర పరిధిలో పలు కూడళ్ల వద్ద ట్రాఫిక్ క్రమబద్ధీకరణ కోసం వీటిని ఏర్పాటు చేశామన్నారు. విజయవాడ న్యూ కావేరీ ఏజెన్సీకి చెందిన వెంకటేశ్వరరావు రూ.4 లక్షల విరాళంతో పది ట్రాఫిక్ పోలీస్ బూత్‌లను తయారు చేయించినట్లు చెప్పారు. కార్యక్రమంలో సీఐలు జి.ప్రసాదరావు, చంద్రబాబు పాల్గొన్నారు.

ఆరోగ్యం మన చేతుల్లోనే

మహానంది, న్యూస్‌టుడే : ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందని ఎంపీహెచ్ఈవో బీసీ హుస్సేన్‌రెడ్డి పేర్కొన్నారు. ఎం.తిమ్మాపురం ఆదర్శ పాఠశాలలో మంగళవారం ప్రపంచ చేతుల పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు వ్యక్తిగత శుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ అమీనాబీ, బీ.విజయ్, ఏఎన్ఎం భార్గవి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
నందికొట్కూరు : 94403 61729
ఆత్మకూరు : 90149 09024
నంద్యాల : 98853 28120

ఆత్మకూరు పట్టణం : సమస్య : ఇందిరానగర్‌కు సరఫరా అయ్యే నీళ్లు దుర్గంధం వెదజల్లుతున్నాయి. పైపు లైను లీకేజీ వల్ల కలుషిత నీరు సరఫరా అవుతోంది. - **మనోహర్, స్థానికుడు**

సమాధానం : పైపులైన్ను పరిశీలించి మరమ్మతులు చేయిస్తాం. - **షాహీర్‌బాషా, పురపాలక ఏఈ**

సమస్య : తోటగేరిలో మురుగు కాల్వల్లో పూడిక తొలగించి పక్కనే వేశారు. ఆ వ్యర్థాలు మళ్లీ కాల్వలోకి చేరుతున్నాయి. - **మధు, స్థానికుడు**

సమాధానం : కార్మికులకు సూచించి వ్యర్థాలు తొలగింపజేస్తాం. - **జీవన్‌కుమార్, పారిశుద్ధ్య పర్యవేక్షకులు**

మంత్రి ఫరూక్‌ను కలిసిన ఎస్ఈ



మంత్రి ఫరూక్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఆర్అండ్‌బీ ఎస్ఈ

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌ను ఉమ్మడి జిల్లా ఆర్అండ్‌బీ ఎస్ఈ మహేశ్వరరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. స్థానిక మంత్రి కార్యాలయంలో మంగళవారం రాత్రి ఆయన మంత్రిని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో ఈఈ శ్రీధర్‌రెడ్డి, డీఈ సుబ్బరాయుడు, వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీ వద్ద బస్సు నిలపాలి

నందికొట్కూరు, న్యూస్‌టుడే : పట్టణ శివారులో ఉన్న జగనన్న కాలనీ వద్ద ఆర్టీసీ రిక్వెస్టు స్టాప్ ఏర్పాటు చేయాలని రైతు సంఘం నాయకుడు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. నందికొట్కూరు డిపోలో సీఐ సరోజమ్మకు జగనన్న కాలనీ వాసులతో కలిసి మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాలనీ నుంచి పట్టణానికి రావాలంటే సుమారు రెండు కి.మీ. దూరం ఉందని దీంతో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. కాలనీవాసులు, నాయకులు స్వామన్న, షేక్షావలి, బాషా, వెంకటరమణ, హుస్సేన్, జనార్దన్ పాల్గొన్నారు.

నల్లమలలో నాటుసారా ఏరులు

☛ యథేచ్ఛగా తయారీ, విక్రయాలు ☛ గత నెల ఐదు రోజుల్లోనే 33 కేసులు

నంద్యాల నేరవిభాగం, న్యూస్‌టుడే : నల్లమల అటవీ ప్రాంతంలో నాటుసారా తయారీ మళ్లీ జోరందుకుంది. ఆబ్కారీ శాఖ నిఘా లోపించడం, కొందరు అటవీ సిబ్బంది లోపాయికారిగా సహకరిస్తుండటంతో అక్రమార్కులు యథేచ్ఛగా సారా కాస్తున్నారు. గ్రామీణ ప్రాంతాలతో పాటు పట్టణాలకు సైతం తరలించి విక్రయాలు సాగిస్తున్నారు. గతంలో నాటుసారా, ఇతర రాష్ట్రాల మద్యాన్ని అరికట్టడానికి ప్రత్యేకంగా సెబ్ విభాగం ఉండేది. గత నెలలో ప్రభుత్వం సెబ్ విభాగాన్ని ఆబ్కారీ శాఖలోకి విలీనం చేసింది. ఆ శాఖ అధికారులు బదిలీలు, నూతన మద్యం పాలసీ టెండర్లపైనే దృష్టిపెట్టారని.. నాటుసారా స్థావరాలను పట్టించుకోవడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

నవోదయం 2.0 ఫలితాన్నిచ్చేనా..

గ్రామాల్లో నాటుసారా తయారీని అరికట్టడంతో పాటు ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఏడేళ్ల కిందట అప్పటి తెదేపా ప్రభుత్వం నవోదయం కార్యక్రమాన్ని చేపట్టింది. నాటుసారా కట్టడికి విస్తృత చర్యలు చేపట్టింది. వైకాపా అధికారంలోకి వచ్చాక ఆ కార్యక్రమాలు అటకెక్కాయి. మళ్లీ సారా తయారీ జోరందుకుంది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం మళ్లీ నవోదయం 2.0 కార్యక్రమం అమలుకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగానైనా అధికారులు నాటుసారా తయారీ, విక్రయాలను అరికట్టేందుకు పటిష్ఠ చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.


అటవీ ప్రాంతంలో నాటుసారా బట్టీలను ధ్వంసం చేస్తున్న సెబ్, పోలీస్ అధికారులు (పాతచిత్రం)

పట్టణాల్లో విక్రయాలు

నంద్యాల పట్టణంలోని పాతపట్టణం, నూనెపల్లె, రైల్వేస్టేషన్ పరిధిలో విస్తృతంగా నాటుసారా విక్రయాలు జరుగుతున్నాయి. పట్టణ శివారులో కూడా నాటుసారా బట్టీలు నిర్వహిస్తుండటం గమనార్హం. నాటుసారా తయారీకి అవసరమైన బెల్లం విక్రయాలు పట్టణంలో యథేచ్ఛగా సాగుతున్నాయి. వాటిని అరికట్టాల్సిన అధికారులు వ్యాపారుల నుంచి మామూళ్లకు అలవాటుపడి చూసీచూడనట్లు వదిలేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి.

పుణ్యక్షేత్రాల చెంతనే..

పుణ్యక్షేత్రాలైన శ్రీశైలం, మహానంది సమీప ప్రాంతాల్లో సైతం నాటుసారా విక్రయాలు సాగుతున్నట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. క్షేత్రాల పరిసరాల్లో విక్రయాలు సాగిస్తూ గత నెలలో కొందరు పట్టుబడ్డారు. మహానంది క్షేత్రం చుట్టుపక్కల నాటుసారా విక్రయాలు యథేచ్ఛగా సాగుతున్నా కట్టడి చేసే వారు కరవయ్యారు. దీంతో తాగుబోతులు భక్తులను ఇబ్బందులకు గురి చేస్తున్న ఘటనలు తరచూ చోటుచేసుకుంటున్నాయి.

దాడులు.. కేసులు

నంద్యాల జిల్లాలో గతేడాది నుంచి ఈ ఏడాది ఏప్రిల్ వరకు 1100 కేసులు నమోదు చేసి, 3 వేల మందిని అరెస్టు చేశారు.

☛ ఇటీవల ఆత్మకూరు మండలం సిద్ధపల్లి సమీపంలోని నల్లమల అటవీ ప్రాంతంలో బట్టీలపై పోలీసులు దాడులు చేసి 500 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు.

☛ గత నెలలో 21 నుంచి 25 తేదీల మధ్య పోలీసులు నాటుసారా స్థావరాలు, విక్రయదారులపై దాడులు చేసి 33 కేసులు నమోదు చేయడంతో పాటు 165 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుల్లో 37 మందిని అరెస్టు చేశారు.

☛ గత నెల 20న డి.రంగాపురం గ్రామ అటవీ ప్రాంతంలో నాటుసారా స్థావరాలపై పోలీసులు దాడి చేసి 2500 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి 100 లీటర్ల నాటుసారా సీజ్ చేశారు.

☛ బ్రాహ్మణకొట్కూరు పరిధిలోని కోళ్లబావాపురం గ్రామ సమీపంలో నాటుసారా బట్టీలపై పోలీసులు దాడులు చేసి 500 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి 30 లీటర్ల నాటుసారా పట్టుకున్నారు.

☛ ఈనెల 4న క్యూఆర్టీ బృందం విస్తృత దాడులు నిర్వహించింది. 12 కేసులు నమోదు చేసి 143 లీటర్ల సారా స్వాధీనం చేసుకుంది.

☛ ఆగస్టు 23న సెబ్ ఆధ్వర్యంలో జిల్లాలో నాటుసారా విక్రేతలపై 6 కేసులు నమోదు చేసి 28 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు.

నేత్ర పరీక్షలకు మంగళం



నందికొట్కూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలోని కంటి పరీక్షా కేంద్రం మూతపడింది. గత పదేళ్లుగా ఇక్కడ కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా అద్దాలు అందజేశారు. ఈ కేంద్రాన్ని నిర్వహిస్తున్న ప్రైవేటు సంస్థ కాల పరిమితి ముగియడంతో అందులోని పరికరాలను విక్రయించి వెళ్లిపోయారు. దీంతో కేంద్రానికి తాళం పడింది. ఈ విషయం తెలియక కంటి పరీక్షల కోసం వచ్చిన రోగులు నిరాశతో వెనుదిరగాల్సి వస్తోంది.

– న్యూస్‌టుడే, నందికొట్కూరు

గడిగరేవులలో అమ్మవారి జాతర

గడివేముల, న్యూస్‌టుడే : మండలంలోని గడిగరేవుల గ్రామంలో మంగళవారం గంగమ్మ, సుంకులమ్మ అమ్మవారి జాతర ఘనంగా నిర్వహించారు. గ్రామంలో గంగమ్మ, సుంకులమ్మ అమ్మవారి ఆలయాలను నూతనంగా నిర్మించారు. విగ్రహ ప్రతిష్ఠ జరిగి 40 రోజులు పూర్తయిన తర్వాత జాతర నిర్వహించారు. పలువురు భక్తులు అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు.

అబ్దుల్‌కలాం జీవితం ఆదర్శం



అబ్దుల్‌కలాం చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు


ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్య వేదిక ఆధ్వర్యంలో నివాళులు

నంద్యాల పాతపట్టణం, న్యూస్‌టుడే : మాజీ రాష్ట్రపతి భారతరత్న డా.ఏపీజే అబ్దుల్ కలాం జీవితం ప్రతిఒక్కరికి ఆదర్శమని ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డా.రవికృష్ణ పేర్కొన్నారు. అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా స్థానిక లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు. ముగ్గురు దివ్యాంగ విద్యార్థులకు ఉపకార వేతనాలు అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు నిజాముద్దీన్, జిల్లా ఛైర్మన్ కొశెట్టి చంద్రశేఖర్, క్లబ్ కార్యదర్శి రమేశ్, సభ్యులు సుధాకర్‌రెడ్డి, కూర ప్రసాద్, నాగరాజు పాల్గొన్నారు.

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్య వేదిక ఆధ్వర్యంలో మాజీ రాష్ట్రపతి, భారతరత్న డా.ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని ఘనంగా నిర్వహించారు. సంస్థ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆకుమల్ల రహీమ్, శివరామిరెడ్డి, రహంతుల్లా, శివశంకర్, శివనారాయణ పాల్గొన్నారు.

☛ రామకృష్ణ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ సుబ్బయ్య, మేనేజర్ ప్రగతిరెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఆత్మకూరు పట్టణం, న్యూస్‌టుడే: భారత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయమని డీఎస్పీ రామాంజీనాయక్ పేర్కొన్నారు. అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకొని ఆత్మకూరు జగద్గురు మఠంలో అబ్దుల్ కలాం స్మారక సమితి ఆధ్వర్యంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. పురపాలక కార్మికులు, చెంచు మహిళలకు చీరలు పంపిణీ చేశారు. వెంకటాపురం గ్రామానికి చెందిన పదో తరగతి విద్యార్థినికి దాత సలాంబాషా రూ.పది వేల ఆర్థిక సాయం చేశారు. అనంతరం వివిధ రంగాల్లో సేవా కార్యక్రమాలు చేపట్టిన పలువురికి డీఎస్పీ శాలువాతో సత్కరించి ప్రశంసాపత్రం అందజేశారు. మండల విద్యాధికారి సురేష్, స్మారక సమితి నాయకులు జవహర్‌నాయక్, నరసింహనాయక్, సుధాకర్, పీఈటీ విజయానంద్, వాసుదేవరెడ్డి పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం


సీసీ రహదారి పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

గడివేముల, న్యూస్‌టుడే : గ్రామాల అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి పేర్కొన్నారు. పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా గడివేముల, చిందుకూరు గ్రామాల్లో మంగళవారం సీసీ రహదారులకు భూమిపూజ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గడివేముల మండలంలో రూ.2.50 కోట్లతో సీసీ రహదారులు వేస్తున్నట్లు తెలిపారు. సంక్రాంతిలోగా నిర్మాణాలు పూర్తిచేస్తే మండలానికి మరో రూ.కోటి నిధులు మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో తెదేపా మండల కన్వీనర్ దేశం సత్యనారాయణరెడ్డి, సర్పంచులు అనసూయమ్మ, రమణమ్మ తెదేపా నాయకులు రఫీక్, సుదర్శనరెడ్డి, కృష్ణాయాదవ్, సుభద్రమ్మ, శివారెడ్డి, పంటా రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లె (నంద్యాల గ్రామీణం), న్యూస్‌టుడే : మండలంలోని కొత్తపల్లె గ్రామంలో సర్పంచి నారాయణ ఆధ్వర్యంలో మంగళవారం పల్లె పండగ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ తాతిరెడ్డి తులసిరెడ్డి సీసీరోడ్ల పనులకు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో సుగుణశ్రీ, పంచాయతీ కార్యదర్శి గీతావాణి, మండల ఇంజినీరు శంకర్ పాల్గొన్నారు.

నారాయణాపురం (బండిఆత్మకూరు), న్యూస్‌టుడే : రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతోనే సాధ్యమవుతుందని శ్రీశైలం నియోజకవర్గ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. పల్లె పండగ వారోత్సవాల్లో భాగంగా నారాయణాపురం, లింగాపురం, ఈర్నపాడు, బి.కోడూరులో నిర్మించనున్న సీసీ రోడ్ల పనులకు మంగళవారం ఆయన భూమిపూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత ఐదేళ్ల వైకాపా పాలనలో చేయలేని అభివృద్ధి, సంక్షేమాన్ని కూటమి ప్రభుత్వం వందరోజుల్లోనే చేస్తోందని చెప్పారు. కార్యక్రమంలో తెదేపా సమన్వయకర్త బన్నూరు రామలింగారెడ్డి, నాయకులు కంచర్ల సురేష్‌రెడ్డి, నందిపాటి నరసింహారెడ్డి, మనోహర్‌చౌదరి, పాలశంకర్, భరద్వాజశర్మ, అన్నం శివశంకర్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి

సమస్యల పరిష్కారానికి పెద్దపీట


అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే జయసూర్య

మిడుతూరు, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కారానికి పెద్దపీట వేస్తామని ఎమ్మెల్యే గిత్త జయసూర్య పేర్కొన్నారు. మిడుతూరు ఎంపీడీవో కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో మంగళవారం ఆయన పాల్గొన్నారు. అనంతరం మిడుతూరు, చింతలపల్లి గ్రామాల్లో పల్లె పండగలో భాగంగా సీసీ రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. తెదేపా మండల అధ్యక్షుడు కాతా రమేష్‌రెడ్డి, నాయకులు వెంకటేశ్వరరెడ్డి, విష్ణు, సర్వోత్తమరెడ్డి, రఘురామయ్య, ఎంపీడీవో దశరథ రామయ్య, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మహానంది, న్యూస్‌టుడే: పల్లె పండగ కార్యక్రమం అభివృద్ధికి మార్గమని ఎంపీపీ బుడ్డారెడ్డి యశస్విని పేర్కొన్నారు. మహానంది మండలం అబ్బీపురం, బొల్లవరం గ్రామాల్లో మంగళవారం ఆమె పలు అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. ఎంపీడీవో మహబూబ్‌దౌలా, ఈవోఆర్డీ నాగేంద్రుడు, ఉపాధిహామీ ఏపీవో మనోహర్, పీఆర్ ఏఈఈ రాజశేఖరరెడ్డి, దూదేకుల దస్తగిరి, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

పగిడ్యాల, న్యూస్‌టుడే: పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని బీరవోలులో మంగళవారం సీసీ రోడ్లు నిర్మాణానికి, పలు అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. ఎంపీడీవో సుమిత్రమ్మ, ఈవోఆర్డీ నాగేంద్రయ్య, పంచాయితీ కార్యదర్శి ఉపేంద్రరెడ్డి, తెదేపా నాయకులు పుల్యాల వాసురెడ్డి, దామోదర్‌రెడ్డి, హనుమన్న, రామకృష్ణ పాల్గొన్నారు.

భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడాలి

నంద్యాల గ్రామీణం, న్యూస్‌టుడే : రైతులు భూసార పరీక్షల ఫలితాల ఆధారంగా పంటలకు రసాయనిక ఎరువులు వాడాలని మండల వ్యవసాయాధికారి ప్రసాదరావు సూచించారు. మండలంలోని చాపిరేవుల, పాండురంగాపురం గ్రామాల్లో మంగళవారం ఆయన పొలం పిలుస్తోంది కార్యక్రమాలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు మూడేళ్లకోసారి మట్టి పరీక్షలు చేయించుకోవాలన్నారు. మండల వ్యవసాయ విస్తరణాధికారి మణిమోహన్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

వ్యాస రచన పోటీలకు స్పందన

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : అలీగఢ్ ముస్లిం విశ్వవిద్యాలయం వ్యవస్థాపకుడు సర్ సయ్యద్ అహ్మద్‌ఖాన్ జీవిత చరిత్రపై మజ్లిస్ ఉల్ ఉల్మా వ అయమ్మ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాస రచన పోటీలకు విశేష స్పందన లభించినట్లు నిర్వాహకులు తెలిపారు. స్థానిక ముల్లాన్‌పేట మున్సిపల్ ఉర్దూ బాలికోన్నత పాఠశాలలో మంగళవారం హాఫిజ్ అంజద్‌బాషా సిద్దిఖీ ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించారు. వివిధ పాఠశాలలకు చెందిన 150 మంది విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలకు ఈనెల 17న బహుమతులు ప్రదానం చేస్తామని ఈ అంజద్‌బాషా సిద్దిఖీ తెలిపారు.


పోటీల్లో పాల్గొన్న విద్యార్థినులు

వాల్మీకి జయంతిని విజయవంతం చేయాలి

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : నంద్యాలలో ఈనెల 17న నిర్వహించనున్న మహర్షి వాల్మీకి జయంతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారిణి చింతామణి కోరారు. స్థానిక ఆర్టీసీ బస్టాండు సమీపంలో గురువారం ఉదయం 10 గంటలకు కలెక్టర్ ఆధ్వర్యంలో వాల్మీకి జయంతి నిర్వహిస్తున్నట్లు మంగళవారం ఆమె ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ శాఖల అధికారులు, బోయ, వాల్మీకులతో పాటు విద్యార్థి సంఘాల నాయకులు హాజరవ్వాలని కోరారు.

హనుమంతుడికి వెండి కిరీటం బహూకరణ


వెండి కిరీటంతో స్వామివారు

పగిడ్యాల, న్యూస్‌టుడే: పగిడ్యాల మండలం పడమర ప్రాతకోటకు చెందిన గంటె మల్లికార్జున, గంటె సుధాకర్ మంగళవారం అభయాంజనేయ స్వామికి వెండి కిరీటాన్ని బహూకరించారు. రూ.55 వేల విలువ చేసే 50 తులాల వెండి కిరీటాన్ని అర్చకులు స్వామివారికి అలంకరించి పూజలు చేశారు.

గ్రామాభివృద్ధికి కృషి చేయాలి



మాట్లాడుతున్న ఎంపీపీ బుడ్డారెడ్డి యశస్విని

తిమ్మాపురం (మహానంది), న్యూస్‌టుడే : గ్రామాల అభివృద్ధికి అధికారులు కృషి చేయాలని ఎంపీపీ బుడ్డారెడ్డి యశస్విని కోరారు. ఎం.తిమ్మాపురం మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో మంగళవారం సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్‌కలాం జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. తిమ్మాపురం సమీపంలో ఉన్న ఎస్ఎస్ ట్యాంక్‌ను ఆధునికీకరించి 22 గ్రామాలకు మంచినీరు అందించడానికి రూ.250 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించినట్లు తెలిపారు. వివిధ శాఖలకు చెందిన అధికారులు సరైన సమాధానాలు ఇవ్వకపోవడం, సమాచారం లేకపోవడంతో ఆమె అసహనం వ్యక్తం చేశారు. జడ్పీటీసీ సభ్యుడు కేవీఆర్ మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ.. సీతారామాపురం నుంచి మోత్కూరుకు వెళ్లే దారిని ఉపాధిహామీ పథకం ద్వారా బాగు చేయించాలన్నారు. మండల ఉపాధ్యక్షురాలు లక్ష్మీనరసమ్మ, ఎంపీడీవో మహబూబ్‌దౌలా, ఎంఈవో రామసుబ్బయ్య, డాక్టర్లు భగవాన్‌దాస్, వెంకటరెడ్డి, ఐసీడీఎస్ పర్యవేక్షకురాలు, పలు గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

వానొస్తే వేదన.. రహదారులు బాగుపడేనా

చిన్నపాటి వర్షం కురిసినా నందికొట్కూరు పట్టణంతో పాటు పలు గ్రామీణ రహదారులు బురదమయం అవుతున్నాయి. గుంతల దారుల్లో నీరు నిలిచి ప్రమాదకరంగా మారుతున్నాయి. మంగళవారం సాయంత్రం కురిసిన వర్షానికి నందికొట్కూరు- నాగలూటి మార్గంలో, నందికొట్కూరు పట్టణ శివారులోని డిగ్రీ కళాశాల వద్ద రహదారిపై నీరు నిలిచింది. అడుగడుగునా గోతులతో నిండిన ఈ రహదారులపై రాకపోకలు సాగించేందుకు వాహనదారులు అష్టకష్టాలు ఎదుర్కొంటున్నారు.

– న్యూస్‌టుడే, నందికొట్కూరు


నందికొట్కూరు– నాగలూటి రహదారి దుస్థితి


నందికొట్కూరు డిగ్రీ కళాశాల వద్ద..

కలాం.. క్రికెట్ కెరటం



పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే : క్రికెట్ పట్ల ఆసక్తితో బ్యాట్ పట్టిన కలాం.. పట్టుదలతో సాధన చేస్తూ.. పోటీల్లో సత్తా చాటుతూ విజయ పథంలో సాగుతున్నాడు. ఇంజినీరింగ్ విద్యనభ్యసిస్తూనే ఆటతీరును మెరుగుపర్చుకుంటూ బౌలింగ్‌లోనూ ప్రతిభ చూపుతున్నాడు. ఆల్‌రౌండర్‌గా రాణిస్తూ అంచెలంచెలుగా ఎదుగుతున్నాడు. తాజాగా జాతీయ స్థాయిలో పోటీపడనున్న జేఎన్‌టీయూఏ జట్టుకు ఎంపికయ్యాడు. జాతీయ జట్టులో స్థానమే లక్ష్యంగా సాధన చేస్తున్నట్లు చెబుతున్నాడు దుద్యాల యువకుడు.

☛ ఆత్మకూరు మండలం దుద్యాల గ్రామానికి చెందిన మూలింటి సలాం, నసీమా దంపతుల కుమారుడు కలాం. బీటెక్‌లో సీఎస్ఈ డేటా సైన్స్‌లో మూడో సంవత్సరం చదువుతున్నాడు. క్రికెట్ క్రీడంటే మక్కువతో బ్యాటింగ్, బౌలింగ్‌లో రాణిస్తున్నాడు. శాంతిరాం ఇంజినీరింగ్ కళాశాల తరఫున అనంతపురం జేఎన్‌టీయూ క్రికెట్ జట్టులో బౌలర్‌గా స్థానం పొందాడు.

☛ 2017లో అండర్- 14లో విభాగంలో కర్నూలులో జరిగిన ఏపీ జట్టు ఎంపికలో పోటీ పాల్గొని ప్రతిభ చూపాడు.

☛ 2018లో ఆర్‌యూ పరిధిలో జరిగిన అంతర్ కళాశాలల క్రికెట్ పోటీల్లో రాణించాడు.

☛ హైదరాబాద్‌లో జరిగిన పలు ప్రైవేటు లీగ్ పోటీల్లో పాల్గొని గుర్తింపు పొందాడు.

☛ 2023లో ఐఎస్‌పీఎల్‌లో పోటీల్లో పాల్గొని 2వ లెవల్ వరకు చేరుకున్నాడు.

☛ ఈనెల 7న నెల్లూరు ఆదిశంకర ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన జేఎన్‌టీయూఏ క్రికెట్ జట్టు ఎంపిక పోటీల్లో ప్రతిభ చూపి జట్టులో స్థానం పొందాడు.

☛ డిసెంబరులో చెన్నై ఐఐటీలో నిర్వహించనున్న జాతీయ స్థాయి అంతర్ విశ్వవిద్యాలయాల పోటీల్లో ఆడనున్నాడు.

పంట కోతలు వాయిదా వేసుకోవాలి

వెలుగోడు, న్యూస్‌టుడే: వర్షాలు తగ్గే వరకు రైతులు పంట కోతలు నిలిపి వేయాలని ఏవో పవన్‌కుమార్ సూచించారు. వెలుగోడు మండలం అబ్దుల్లాపురంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాల కారణంగా పొలాల్లో నిలిచి ఉన్న నీటిని ఎప్పటికప్పుడు బయటికి పంపే మార్గాలు చేసుకొని పంటలను కాపాడుకోవాలని చెప్పారు. పంటలు నూర్పిడి చేసి ఉంటే ధాన్యాన్ని రక్షించుకోవాలని వివరించారు. ఆయా గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో పంటల వివరాలను ఏర్పాటు చేశామన్నారు. ఈపంట నమోదులో తప్పులు, సవరణకు చివరి అవకాశం ఉందని ఏమైనా తప్పులు ఉంటే సరి చేసుకోవాలని సూచించారు. వ్యవసాయ సిబ్బంది అంజిత్‌కుమార్‌రెడ్డి, అఫ్సర్, అలీ, రైతులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి పోరాటాలు

పగిడ్యాల, న్యూస్‌టుడే: ప్రజా ఉద్యమాలు నిర్వహించి వారి సమస్యల పరిష్కారానికి పోరాటాలు చేయడమే సీపీఎం లక్ష్యమని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి రమేష్ కుమార్ పేర్కొన్నారు. పగిడ్యాల మండల సమైక్య కార్యాలయంలో సీపీఎం మండల మొదటి మహాసభ మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు పండించిన ధాన్యానికి ప్రభుత్వం కనీస మద్దతు ధర కల్పించాలని, కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చి బ్యాంకు రుణాలు, ప్రభుత్వ రాయితీలు అందించాలని డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు నాగేశ్వరరావు, సీపీఎం మండల నాయకులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

ఆత్మకూరు పట్టణం, న్యూస్‌టుడే: పట్టణ శివారులోని మదర్సా వెనక వైపు జూదం ఆడుతున్న ఏడుగురిని అరెస్టు చేసి వారి నుంచి రూ.1.03 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు సీఐ ఓబులేసు మంగళవారం తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు వివరించారు.

మహానంది, న్యూస్‌టుడే : మండలంలోని సీతారామాపురం నుంచి మోత్కులపల్లి వెళ్లే దారిలో జూదం ఆడుతున్న నలుగురిని అరెస్టు చేసినట్లు ఎస్సై ఎన్.రామమోహన్‌రెడ్డి మంగళవారం తెలిపారు. వారి వద్ద నుంచి రూ.12,125 నగదు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

చిరుత అడుగుల గుర్తింపు

మిడుతూరు, న్యూస్‌టుడే: మిడుతూరు సమీపంలోని వేసవి నీటి కుంట ఆవరణలో చిరుత అడుగులను గుర్తించారు. వెలుగోడు రేంజర్ ఖాన్, ఎఫ్‌బీవో శ్రీనివాసులు, ఇతర అటవీ సిబ్బంది మంగళవారం క్షేత్రస్థాయిలో పర్యటించారు. నీటి కుంట సిబ్బంది మధు తెలిపిన సమాచారం మేరకు కాలి గుర్తుల నమూనాలు పరిశీలించి, అవి చిరుత అడుగులని రేంజర్ ఖాన్ స్పష్టం చేశారు. బుధవారం నీటి కుంట ఆవరణలో ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేస్తామని రేంజర్ వెల్లడించారు.

ఆళ్లగడ్డ

• ఆళ్లగడ్డ • బనగానపల్లి • డోన్

భక్తిశ్రద్ధలతో తెప్పోత్సవం

బేతంచెర్ల, న్యూస్‌టుడే : పట్టణంలోని అమ్మవారి



తెప్పోత్సవంలో వాసవీమాత అమ్మవారు

శాలలో దసరా నవరాత్రి ఉత్సవాలు మంగళవారం తెప్పోత్సవంతో వైభవంగా ముగిశాయి. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు గుండా గోపాల్, కందగడ్డల మోహన్, బచ్చు సుబ్రహ్మణ్యం తదితరుల ఆధ్వర్యంలో వాసవీమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించి తెప్పోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆర్యవైశ్యులు, వాసవీ మహిళా మండలి సభ్యులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. విజయలక్ష్మీ, లీలాకుమారి, ఉమాదేవి, నాగమణి, సుభాషిణి, భైసాని శేషఫణి, పాల్గొన్నారు.

ఘనంగా జెండా వాలే సాహెబ్ దర్గా ఉరుసు

బనగానపల్లి, న్యూస్‌టుడే : బనగానపల్లిలో మంగళవారం జెండా వాలే సాహెబ్ దర్గా ఉరుసు ఘనంగా నిర్వహించారు. ఏటా సంప్రదాయబద్ధంగా జరిగే ఉరుసు కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఉరుసు సందర్భంగా అన్నదానం చేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
ఆళ్లగడ్డ: 8008 574916
డోన్ పట్టణం: 94408 57790
బనగానపల్లె: 80085 73763

సమస్య : శ్రీనివాసనగర్‌లో ప్రధాన రహదారి పక్కన మురుగు కాల్వకు ఇరువైపుల పిచ్చిమొక్కలు, ముళ్లకంపలు పెరిగిపోయాయి. **– రమేష్, శ్రీనివాసనగర్**

సమాధానం : సిబ్బంది చేత ముళ్లకంపలను తొలగింపజేస్తాం. **-తాత్కాలిక శానిటరీ అధికారి సునీల్**

సమస్య : కొత్త ఇందిరానగర్ నుంచి ఆటోనగర్ వరకు కాల్వలో వ్యర్థాలు పూడుకుపోయాయి.

– లక్ష్మీదేవి, కొత్త ఇందిరానగర్

సమాధానం : కాల్వలో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగిస్తాం. **-తాత్కాలిక శానిటరీ అధికారి సునీల్**

- న్యూస్‌టుడే, డోన్ పట్టణం

పాన్పుసేవాలో అమ్మవారు



శ్రీకన్యకాపరమేశ్వరి దేవి ఆలయంలో

రుద్రవరం న్యూస్‌టుడే : శరన్నవ రాత్రి ఉత్సవాల్లో భాగంగా స్థానిక శ్రీకన్యకాపరమేశ్వరి దేవి ఆలయంలో మంగళవారం అమ్మవారు పాన్పుసేవా అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్యులు అధిక సంఖ్యలో పాల్గొని విశేష పూజలు నిర్వహించారు.

ఆళ్లగడ్డలో పోలీసుల కవాతు

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే : పట్టణంలో మంగళవారం సీఐ చిరంజీవి ఆధ్వర్యంలో ప్రత్యేక బలగాలు పట్టణంలోని మెయిన్ బజారు, టీబీ రోడ్డుల మీదుగా కవాతు నిర్వహించారు. మద్యం దుకాణాల ప్రారంభోత్సవాలు, ఇతర రాజకీయ కారణాల వల్ల పట్టణంలో అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా ఉండేందుకు బందోబస్తు నిర్వహిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



పోలీసుల కవాతు

సూక్ష్మ సేద్యానికి మోక్షం

కోవెలకుంట్ల న్యూస్‌టుడే : సూక్ష్మ సేద్యంలో సాగునీటి సంరక్షణతోపాటు తక్కువ ఖర్చులతో వ్యవసాయం చేస్తూ అధిక లాభాలు పొందవచ్చు. ఈ విధానాన్ని గతంలో ప్రభుత్వాలు ప్రోత్సహించేవి. 2014-19 మధ్య కాలంలో చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఈ పథకానికి పెద్దపీట వేశారు. రైతులకు గ్రామస్థాయిలో అవగాహన కల్పిస్తూ రాయితీపై పరికరాలు అందిస్తూ సూక్ష్మసేద్యం పద్ధతిని ప్రోత్సహించేవారు. కానీ గత ఐదేళ్ల కాలంలో వైకాపా ప్రభుత్వంలో ఈ పథకం ఆదరణ కోల్పోయింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో సూక్ష్మ సేద్య పథకానికి జీవం పోసినట్లైంది. రైతులను సూక్ష్మ సేద్యంలో ప్రోత్సహించేందుకు బిందు, తుంపర సాగుకు అవసరమైన పరికరాలను రాయితీపై అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది.



పొలంలో అమర్చిన బిందు సేద్యం పరికరాలు

ప్రస్తుతం మండలాలవారీగా దరఖాస్తు చేసుకున్న రైతుల వివరాలు

మండలం	రైతులు	విస్తీర్ణం (హెక్టార్లలో)
కోవెలకుంట్ల	195	220
కొలిమిగుండ్ల	352	405
సంజామల	452	558
దొర్నిపాడు	55	70
ఉయ్యాలవాడ	305	357

సూక్ష్మ సేద్యం పథకంపై ప్రభుత్వం దృష్టి

సూక్ష్మ సేద్య పథకంపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. వ్యవసాయశాఖకు నిధులు కేటాయించడంతోపాటు సూక్ష్మ సేద్యంలో రైతులను ప్రోత్సహించాలని రాయితీపై పరికరాలు అందించేందుకు వివరాలు నమోదు చేసుకోవాలని ఆదేశించింది. పరికరాల సరఫరా నిమిత్తం 18రకాల కంపెనీలను ఎంపిక చేసింది. ఇప్పటికే ఏపీఎంఐపీ శాఖ అధికారులు రైతుల నుంచి వివరాలు సేకరించే పనిలో ఉన్నారు. జిల్లాలో 15 వేల హెక్టార్లలో ఈ పథకం అమలుకు లక్ష్యంగా నిర్ధేశించుకున్నారు. గతంతో పోలిస్తే ఇది మూడింతలు అధిక లక్ష్యంగా ఉంది. ఇప్పటికే 11,762 హెక్టార్లకు దరఖాస్తులు అందినట్లు అధికారులు చెబుతున్నారు.

రాయితీ వివరాలు

బిందు, తుంపర సేద్యానికి అవసరమైన పరికరాలను కూటమి ప్రభుత్వం 45 నుంచి 90శాతం వరకు రాయితీతో అందించేందుకు చర్యలు చేపట్టింది. డ్రిప్‌లకు సంబంధించి 5 ఎకరాల లోపు ఉన్న చిన్న, సన్నకారు రైతులకు 90శాతం రాయితీ, 5నుంచి 10ఎకరాల వరకు ఉన్న రైతులకు 70శాతం రాయితీ ఇస్తోంది. స్ప్రింక్లర్లకు సంబంధించి 5 ఎకరాలలోపు ఉన్న చిన్న, సన్నకారు రైతులకు 55శాతం రాయితీ, 5నుంచి 10ఎకరాల లోపు ఉన్న రైతులకు 45శాతం రాయితీని అందిస్తోంది. అర్హులైన రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ వివరాలతో సమీపంలోని రైతు సేవా కేంద్రాలను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవచ్చు. ఏ కంపెనీకి చెందిన పరికరాలు కావాలో రైతులే ఎంచుకోవచ్చు. సంబంధిత కంపెనీ ప్రతినిధులు రైతు పొలాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతులు డీడీ చెల్లించిన నెలరోజుల్లో పరికరాలు సరఫరా చేస్తారు.



పంటకు సాగునీటిని అందిస్తున్న తుంపర సేద్యం పరికరాలు

మార్చి వరకు దరఖాస్తు చేసుకోవచ్చు

- సుధామణి, ఏపీఎంఐపీ ఏవో

సూక్ష్మ సేద్య పద్ధతిలో వ్యవసాయం రైతులకు ఎంతో లాభదాయకం. ఈ పద్ధతిలో వ్యవసాయానికి అవసరమైన డ్రిప్‌లు, స్ప్రింక్లర్లు రాయితీపై ప్రభుత్వం అందించేందుకు చర్యలు చేపట్టింది. ఇప్పటికే రైతుల వివరాల నమోదు జరుగుతోంది. దీనికి దరఖాస్తు చేసుకునేందుకు రైతు సేవా కేంద్రాల్లో, ఏపీఎంఐపీ పీడీ కార్యాలయాల్లోనూ, శాఖ సిబ్బంది గ్రామాలకు వచ్చినపుడు నేరుగానూ పేర్లు నమోదు చేసుకోవచ్చు. మార్చి వరకు నమోదుకు సమయం ఉన్నందున రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

నేడు నీటి సరఫరాకు అంతరాయం

డోన్ పట్టణం న్యూస్‌టుడే : గాజులదిన్నె ప్రాజెక్టు నుంచి డోన్ పట్టణానికి సరఫరా చేస్తున్న మంచినీటి పైపులైన్ ఈదుల దేవబండ, కోటకొండ మధ్యలో తిప్పనకుర్తి గ్రామ సమీపంలో లీకేజీకి గురైనట్లు మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో పట్టణానికి బుధవారం (16వ తేదీ) నీరు సరఫరా చేసేందుకు అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు. నీటి గొట్టాలకు మరమ్మతులు చేయించి 17వ తేదీ ఉదయం నీటిని సరఫరా చేస్తామన్నారు.

గ్రామాల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం

సంజామల న్యూస్‌టుడే : పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా నొస్సం, అక్కంపల్లె, ఆర్. లింగందిన్నె గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలకు ఎంపీడీవో మంగళవారం



భూమిపూజ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీడీవో సాల్మన్, తెదేపా నాయకులు

భూమి పూజ చేశారు. నొస్సం తెదేపా నాయకులు గాధంశెట్టి చిన్నవెంకటేశ్వర్లు, రమణయ్య, అధికారులు పాల్గొన్నారు.

మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తాం

దొర్నిపాడు, న్యూస్‌టుడే : రానున్న రోజుల్లో మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో సావిత్రి



వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

ఆధ్వర్యంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి కోసం ప్రస్తుత కూటమి ప్రభుత్వం మండలానికి రూ.2.50 కోట్ల నిధులు కేటాయించిందన్నారు. ఈ నిధులను గ్రామాల్లో సీసీ రోడ్లు, మురుగు కాల్వలు తదితర వాటికి వినియోగించి గ్రామాన్ని అభివృద్ధి పథంలో నిలుపుతామన్నారు. స్థానిక తహసీల్దార్ పద్మజ, డీటీ, ఆర్‌ఐలు సమావేశానికి గైర్హాజరు కావటంతో వారిపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో నాణ్యమైన సరుకులు సరఫరా అయ్యేలా చూడాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రభాకరమ్మను ఆదేశించారు. అనంతరం మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజా వేదిక పల్లెపండుగ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. జెడ్పీటీసీ సభ్యురాలు శకుంతలమ్మ, ఎంపీపీ అమర్‌నాథ్‌రెడ్డి, మండల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

సత్వరమే పరిష్కరిస్తాం

బేతంచెర్ల, న్యూస్‌టుడే : ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజావేదిక కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారని, ఈ కార్యక్రమానికి పెద్దఎత్తున స్పందన రావడం అభినందనీయమని డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాశ్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ అతిథి గృహంలో మండల నోడల్ అధికారి నసీరున్నీసా బేగం, తహసీల్దార్ ప్రకాశ్ బాబు, ఎంపీడీవో ఫజల్ రహిమాన్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రమేష్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రజా వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో రైతులు వివిధ సమస్యలతో ఇబ్బందులు గురవుతున్నారని, రైతులు సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. పెండేకల్లు గ్రామంలో చెత్త డంప్‌యార్డు నిర్మాణానికి 5 సెంట్ల స్థలం మంజూరు చేయాలని పంచాయతీ కార్యదర్శి నాగప్రసాద్ ఎమ్మెల్యేకు అర్జీని అందజేశారు. అనంతరం ఆర్.కొత్తపల్లె, ఆర్.బుక్కాపురం గ్రామాల్లో పల్లె పండుగ వారోత్సవాలను సర్పంచి నాగరాజు, మునీశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డి భూమి పూజ చేశారు. డీఈ ప్రసాద్‌రెడ్డి, పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు వసంతలక్ష్మి, డాక్టర్ చరణ్‌రాజు, ఏఈ మధు, రాజశేఖర్‌రెడ్డి, తిప్పన్న, రాధమ్మ పాల్గొన్నారు.



అర్జీదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోట్ల

మంత్రిని కలిసిన భూమా విఖ్యాత్‌రెడ్డి

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే : జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పయ్యావుల కేశవ్‌ను విజయవాడ పార్టీ కార్యాలయంలో ఆళ్లగడ్డ తెదేపా యువనేత భూమా విఖ్యాత్‌రెడ్డి మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆళ్లగడ్డ అభివృద్ధికి సహకరించాలని కోరారు.



జిల్లా ఇన్‌ఛార్జి మంత్రితో భూమా విఖ్యాత్‌రెడ్డి

ప్రైవేట్ ట్రావెల్ బస్సులపై రూ. 5.55 లక్షల జరిమానా

డోన్‌పట్టణం, న్యూస్‌టుడే : దసరా పండుగను జరుపుకొని తిరుగు ప్రయాణం అవుతున్న ప్రయాణికుల రద్దీ కారణంగా అధిక ధరలకు



ప్రైవేట్ ట్రావెల్ బస్సుల పత్రాలను తనిఖీ చేస్తున్న ఎంవీఐ క్రాంతికుమార్

టికెట్లను విక్రయిస్తున్నారన్న సమాచారం నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీఏ అధికారులు ప్రైవేట్ ట్రావెల్ బస్సులపై దాడులు నిర్వహించారు. డోన్ పట్టణం సమీపంలో అమకతాడు టోల్‌ప్లాజా వద్ద 44వ జాతీయ రహదారిలో సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు మోటార్ వాహనాల తనిఖీ అధికారి (ఎంవీఐ) టి. క్రాంతికుమార్ సిబ్బందితో కలిసి దాడులు జరిపారు. రోడ్ ట్యాక్స్ కట్టని అనంతపురానికి చెందిన మీనా ట్రావెల్స్ బస్సు, ఫిట్‌నెస్ లేకుండా రోడ్‌పై తిరుగుతున్న నాగాలాండ్‌కు చెందిన ఆరెంజ్ ట్రావెల్స్ బస్సు, కర్ణాటకకు చెందిన జబ్బార్ ట్రావెల్స్ బస్సులపై కేసులు నమోదు చేసి రూ. 4.54లక్షల జరిమానా విధించి, బస్సులను జప్తు చేశారు. వీటితో పాటు ఓవర్‌లోడ్‌తో వెళ్తున్న పలు వాహనాలపై కేసు నమోదు చేసి రూ. 1,01,500ల జరిమానా విధించినట్లు ఎంవీఐ క్రాంతికుమార్ పేర్కొన్నారు.

తెదేపా మండల అధ్యక్షుడిపై సీఐ దాడి

డోన్ నేరవిభాగం, న్యూస్‌టుడే : తెదేపా మండల అధ్యక్షుడు, న్యాయవాది సలీంద్ర శ్రీనివాసులపై డోన్ పట్టణ సీఐ ఇంతియాజ్‌బాషా విచక్షణ రహితంగా దాడి చేసి గాయపరిచాడని బాధితుడు డోన్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు వేణుగోపాల్ గౌడ్, ప్రధానకార్యదర్శి క్రిష్ణ ప్రసాద్‌కు మంగళవారం ఫిర్యాదు చేశారు. బాధితుడు తెలిపిన వివరాల మేరకు మండలంలోని వెంకటనాయినిపల్లి గ్రామానికి చెందిన సలీంద్ర శ్రీనివాసులు ఈ నెల 13న తన ఇంటి వద్ద ఉండగా అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి వాహనం నడుపుతూ తన వాహనాన్ని తగిలించాడు. ఈ విషయంలో చిన్నపాటి ఘర్షణ తలెత్తింది. సమాచారం అందుకున్న పట్టణ సీఐ సిబ్బందితో గ్రామానికి చేరుకొని శ్రీనివాసులును స్టేషన్‌కి తరలించి విచక్షణ రహితంగా కొట్టారని బాధితుడు వాపోయాడు. ఈ విషయంపై తనకు న్యాయం చేయాలని డోన్ బార్ అసోసియేషన్‌కు వినతిపత్రం అందజేసినట్లు బాధితుడు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో పూజలు చేయాలి

సంజామల న్యూస్‌టుడే : పలు దేవాలయాల్లో నిత్య పూజలు నిర్వహించే పూజారులు భక్తి శ్రద్ధలతో, దేవాలయ నియమ నిబంధనలు పాటిస్తూ పూజలు చేయాలని జయదేవానందగిరిస్వామి తెలిపారు. మండలంలోని ఆల్వకొండ, ముక్కమల్ల, ముదిగేడు గ్రామాల మధ్యన వెలసిన కాశిరెడ్డి నాయన స్వామి ఆశ్రమంలో మంగళవారం రెండు రోజులు పాటు హిందూ దేవాలయాల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో అర్చక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్చకులు భగవంతునికి భక్తులకు మధ్యన వారధిలా ఉండాలన్నారు. కార్యక్రమంలో శిక్షకులు రామశేషయ్య, నారాయణరెడ్డి, రాఘవాచార్యులు, మునిస్వామి తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకి జయంతిని విజయవంతం చేద్దాం

డోన్, న్యూస్‌టుడే : వాల్మీకి మహర్షి జయంతిని కూటమి ప్రభుత్వం రాష్ట్ర పండుగగా ప్రకటించడంతో వాల్మీకులంతా డోన్‌కి



కరపత్రాలను అందిస్తున్న వాల్మీకి సంఘం నాయకులు

పెద్దఎత్తున తరలివచ్చి జయంతి కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని వాల్మీకి సంఘం నాయకులు వలసల రామకృష్ణ, లక్ష్మీదేవి, పిన్నమద్దిలేటి అన్నారు. ఈ నెల 17న వాల్మీకి జయంతిని పురస్కరించుకుని ఉంగరానిగుండ్ల, దేవరబండ, అబ్బిరెడ్డిపల్లె, వెంకటాపురం, గుమ్మకొండ, బొంతిరాళ్ల, మల్లెంపల్లె, లక్ష్మంపల్లె, దొరపల్లె, ఉడుములపాడు గ్రామాల్లో మంగళవారం పర్యటించి వాల్మీకులకు కరపత్రాలను అందజేశారు.

బేతంచెర్ల న్యూస్‌టుడే : వాల్మీకి జయంతిని విజయవంతం చేయాలని వాల్మీకి సంఘం నాయకులు నాగరాజు, పుట్టపాశం వెంకటేశ్వర్లు, టైలర్ రాముడు, నాగరాజు పేర్కొన్నారు. మంగళవారం బేతంచెర్ల పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు.



బనగానపల్లి : నివాళి అర్పిస్తున్న నాయకులు



బనగానపల్లి గ్రామీణం : వెలుగు ఏపీఎం

అబ్దుల్ కలాం సేవలు మరువలేనివి

మాజీ రాష్ట్రపతి, మిస్సైల్ మ్యాన్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని ఆళ్లగడ్డ, బనగానపల్లి, డోన్ నియోజకవర్గాల్లో ఘనంగా నిర్వహించారు. కలాం విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. **- న్యూస్‌టుడే బృందం**



ప్యాపిలిలో: శిశు మందిరం పాఠశాల యాజమాన్యం



చాగలమర్రి : పాఠశాల సిబ్బంది



ఆళ్లగడ్డ : ప్రధానాచార్యులు, అధ్యాపకులు



ఆగిన పశువసతి గృహం

ఉయ్యాలవాడ మండలంలోని తుడుమలదిన్నెలో పశువుల వసతి గృహ నిర్మాణ పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. 2016-2017లో ఉపాధిశాఖ నుంచి రూ.21 లక్షల నిధులు విడుదలయ్యాయి. అప్పట్లో రూ.11లక్షల నిధులు ఖర్చు చేశారు. అధికారులు రూ. 4లక్షలు మాత్రమే బిల్లులు చెల్లించారు. అనంతరం అధికారంలోకి వచ్చిన వైకాపా నిర్మాణ పనుల పట్ల నిర్లక్ష్యం వహించింది. దీంతో పశువుల వసతి నిర్మాణం మధ్యలోనే నిలిచిపోయింది.

- న్యూస్‌టుడే ఉయ్యాలవాడ

విద్యార్థినీలకు గాయాలు

డోన్ నేరవిభాగం, న్యూస్‌టుడే : ఆర్టీసీ బస్సు ప్రమాదంలో డోన్ ఆదర్శ పాఠశాల విద్యార్థులకు తీవ్ర గాయాలైన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. పట్టణ శివారులో ఉన్న పాఠశాలకు విద్యార్థులు రోజు బస్సులో వెళుతుంటారు. రోజూ మాదిరిగానే మంగళవారం సాయంత్రం బస్సు పాఠశాల వద్దకు రావడంతో ఒక్కసారిగా విద్యార్థులందరూ బస్సు ఎక్కడానికి ఎగబడ్డారు. అకస్మాత్తుగా బస్సు ముందుకు కదలడంతో ఇద్దరూ విద్యార్థినులు 7వ తరగతి చదువుతున్న హరీపాకు కాలు విరగడంతో పాటు, 9వ తరగతి చదువుతున్న జోషికాకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని స్థానికులు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైనా వైద్యం కోసం కర్నూలుకు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్యాపిలి, న్యూస్‌టుడే : మండలంలోని ఏనుగుమర్రి గ్రామ సమీపంలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో విష్ణు (24) మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల మేరకు డోన్ పట్టణం కొండపేటకు చెందిన విష్ణు, డోన్ మండలం ఉంగరానిగుండ్లకు చెందిన మధు పని నిమిత్తం ద్విచక్ర వాహనంపై డోన్ నుంచి గుత్తి వైపు వెళుతున్నారు. ఏనుగుమర్రి వద్దకు రాగానే బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీ కొట్టడంతో విష్ణు అక్కడికక్కడే మరణించగా, మధుకు గాయాలు కావడంతో పోలీసులు అంబులెన్స్‌లో చికిత్స కోసం కర్నూలుకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వేధింపుల కేసు నమోదు

బనగానపల్లి గ్రామీణం న్యూస్‌టుడే : భర్త అదనపు కట్నం, మానసిక వేధింపులకు గురిచేస్తున్నాడని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు నందివర్గం ఎస్సై వెంకటసుబ్బయ్య మంగళవారం తెలిపారు. ఆయన వివరాల ప్రకారం పలుకూరు గ్రామానికి చెందిన సునీతను ఏడాది క్రితం గోస్పాడు మండలం దీబగుంట్లకు చెందిన ఇట్టే. బాలచంద్రుడుకు ఇచ్చి వివాహం చేశారు. వివాహ సమయంలో రూ. 15లక్షల నగదు, 18 తులాల బంగారం కట్నంగా ఇచ్చారు. పెళ్లి అయినప్పటి నుంచి అదనపు కట్నం కోసం అత్తమామలు, భర్త, బావ శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురిచేస్తున్నారని బాధితురాలు ఫిర్యాదు చేసినట్లు ఎస్సై వివరించారు.

ఇరుపార్టీల మధ్య ఘర్షణ

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే : కోవెలకుంట్ల మండలంలోని పెద్దకొప్పెర్ల గ్రామంలో తెదేపా, వైకాపా వర్గాలకు చెందిన కొంతమంది వ్యక్తుల మధ్య మంగళవారం చిన్నపాటి గొడవ జరిగింది. ఈ గొడవలో ఓ వర్గానికి చెందిన వారికి గాయాలు కావడంతో కోవెలకుంట్లలోని ప్రభుత్వం ఆసుపత్రికి తరలించారు.

అవీ.. ఇవీ.. అన్నీ..

డోన్, న్యూస్‌టుడే : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ఛైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డిని తెలంగాణ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ఛైర్మన్ సుంకెట అన్వేష్‌రెడ్డి విజయవాడలోని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.

సంజామల, న్యూస్‌టుడే : అన్నదాతల అభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, రోడ్లు, భవనాలశాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి పని చేస్తున్నారని మండల తెదేపా నాయకులు బత్తుల ప్రతాప్‌రెడ్డి అన్నారు.

కొలిమిగుండ్ల, న్యూస్‌టుడే : మండలంలోని గ్రామపంచాయతీల అభివృద్ధి కోసం రూ. 3.25 కోట్లు నిధులు మంజూరు చేసినట్లు మండల అభివృద్ధి అధికారి ప్రసాదరెడ్డి మంగళవారం తెలిపారు.

ప్యాపిలి న్యూస్‌టుడే : మండలంలోని ఏనుగుమర్రి, మెట్టుపల్లె, ఎన్. రంగాపురం, వెంగళాంపల్లె గ్రామాల్లో సీసీ రోడ్డుకు భూమి పూజ చేసినట్లు ఎంపీడీవో శ్రీనివాసరావు, పీఆర్ ఏఈ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు.

చాగలమర్రి న్యూస్‌టుడే : మండలంలోని శెట్టివీడు, గొడిగనూరు, కొత్తపల్లె, డి.వనిపెంట గ్రామాల్లో సీసీరోడ్లు, కాలువల నిర్మాణ పనులను సర్పంచులు లక్ష్మీదేవి, సంజీవరాయుడు, ఎంపీడీవోలు ప్రారంభించారు.

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే : మండలంలోని వల్లంపాడు, బిజినవేముల, వెలగటూరు గ్రామాల్లో పల్లె పండుగ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు.

ఆళ్లగడ్డ గ్రామీణం న్యూస్‌టుడే : చేతులను శుభ్రం చేసుకోవడంతోనే ఆరోగ్యం పదిలంగా ఉంటుందని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పార్వతి పేర్కొన్నారు.

ప్యాపిలి న్యూస్‌టుడే : చేతులను శుభ్రంగా కడుక్కోవాలని వ్యాధులు దూరమై సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతోందని కమ్యూనిటీ హెల్త్ అధికారి విజయకుమారి, ఆరోగ్య విద్యా బోధకుడు రాఘవేంద్రగౌడు పేర్కొన్నారు.

కోవెలకుంట్ల గ్రామీణం న్యూస్‌టుడే : మండల పరిధిలోని గుల్లదుర్తి, పొట్టిపాడు గ్రామాల్లో మండల వ్యవసాయ అధికారి నిరంజన్ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు.

డోన్ నేరవిభాగం, న్యూస్‌టుడే : స్థానిక పాత మద్యం దుకాణాలకు మంగళవారం చివరి రోజు కావడంతో క్వార్టర్‌కు రూ. 30 నుంచి రూ. 50 వరకు అధికంగా వసూలు చేసి విక్రయించారు.

కాలనీలో.. కనీస సౌకర్యాలు కరవు

డోన్‌పట్టణం, న్యూస్‌టుడే : పురపాలక పరిధిలో సమస్యలు లేకుండా చూస్తాం. స్థానికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మౌలిక సదుపాయాలను కల్పిస్తాం. వీధుల్లో ఏ సమస్య వచ్చినా తమ దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామని గత ప్రభుత్వంలోని ప్రజా ప్రతినిధులు ఐదేళ్ల కాలం గడిపారు. కానీ ప్రస్తుతం క్షేత్ర స్థాయిలో ఎలాంటి పురోగతి లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వంలోనైనా అధికారులు పాలకులు దృష్టి సారించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

వీధుల్లో ప్రగతి కరవు

డోన్ పట్టణంలో ప్రస్తుతం 32 వార్డులలో 75 వేలకు పైగా జనాభా నివసిస్తోంది. వీటితో పాటు కొత్త కాలనీలు కూడా విస్తరించడంతో మున్సిపాలిటీకి ఏటా పన్నుల రూపంలో రూ.5 కోట్లకు పైగానే ఆదాయం వస్తుంది. ప్రజల నుంచి ఇంత పెద్దఎత్తులో పన్నులను వసూలు చేస్తున్న కనీస సౌకర్యాలను కల్పించడంలో పాలకులు, అధికారులు వైఫల్యం చెందుతున్నారు. పట్టణంలోని వైఎస్ నగర్, ఆటోనగర్, కొత్త ఇందిరానగర్, సుజాతమ్మనగర్, కోట్ల విజయభాస్కరరెడ్డి నగర్, శ్రీరామానగర్, నల్లగుట్ట, ఆర్టీసీ కాలనీ, చిగురుమానుపేట, త్రివర్ణకాలనీ, రైతుమిత్ర కాలనీ, వెంకటేశ్వరనగర్, న్యూ స్వీపర్స్ కాలనీ, కృష్ణానగర్, వంటి పలు కాలనీల్లో నెలకొన్న సమస్యలతో ప్రజలు నిత్యం అవస్థలు పడుతున్నారు.

■ పట్టణంలో నెహ్రూనగర్‌లోని ఓ వీధిలో రహదారిపై గుంత ఏర్పడింది. వర్షం రావడంతో నీరు నిలిచి అస్తవ్యస్తంగా మారింది. ఈ దారిలో నిత్యం పదుల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. పాదచారులు సైతం ఈ దారి గుండా ఇతర కాలనీలకు వెళుతుంటారు. ఈ సమస్య ఏళ్లుగా స్థానికులను వేధిస్తున్నా ఇప్పటి వరకు సీసీరోడ్డుకానీ, డ్రైన్‌కి కానీ ఏర్పాటు చేయలేదు.

■ పట్టణంలోని వైఎస్‌ఆర్ నగర్‌లో సీసీ రోడ్లు, మురుగు నీటి పారుదల వ్యవస్థకు సీసీ డ్రైన్లను నిర్మించలేదు. కాలనీలో 250కి పైగానే కుటుంబాలు నివసిస్తున్నాయి. ఇళ్లు, కుళాయిలు వంటి వివిధ పన్నుల రూపేణా ఏటా రూ. లక్షల ఆదాయం మున్సిపాల్టీకి సమకూరుతున్నా వీధుల్లో ప్రగతి పనులు చేపట్టడం లేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



న్యూ స్వీపర్స్ కాలనీకి వెళ్లే మార్గంలో ప్రధాన రహదారి దుస్థితి

పట్టణంలోని న్యూ స్వీపర్స్ కాలనీకి వెళ్లే మార్గంలో ప్రధాన రహదారి సీసీ రోడ్డుకు నోచుకోవడం లేదు. పార్కు ఎదుట ఉన్న రహదారిలో సైతం ఇదే పరిస్థితి ఉంది. చిన్నపాటి వర్షం వచ్చిందంటే చాలు ఆ దారులు బురదమయంగా మారుతున్నాయి.



మున్సిపల్ పార్కు పక్కన ప్రహరీ వెంట పిచ్చిమొక్కలు, ముళ్లకంప

పట్టణంలోని గాంధీనగర్‌లో మున్సిపల్ పార్కు పక్క రహదారిలో గుంత ఏర్పడింది. చిన్న పాటి వర్షం వచ్చిందంటే చాలు నీరు నిల్వ ఉంటోంది. పార్కు ప్రహరీ ఇరువైపుల ముళ్లకంప, పిచ్చిమొక్కలు దట్టంగా పెరగడంతో విషపురుగులు సంచరిస్తున్నాయి. ఆ దారిలో నిత్యం పిల్లల నుంచి పెద్దల వరకు రాకపోకలు సాగిస్తుంటారు.

దారిపై చెత్త.. స్థానికుల చింత

డోన్ పట్టణంలోని తారకరామానగర్‌లో మినీ పార్కు పక్కన రహదారిలో కుండీ వద్ద చెత్తా, వ్యర్థాలు పేరుకుపోయి అపరిశుభ్రత నెలకొంది. ఆ దారిలో నిత్యం పదుల సంఖ్యలో వాహనాలు, పాదచారులు రాకపోకలు సాగిస్తుంటారు. అటు వైపు వెళ్లాలంటేనే జనాలు జడుసుకుంటున్నారు. పారిశుద్ధ్యం విభాగం అధికారులు స్పందించి కుండీల వద్ద పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే డోన్ పట్టణం**





ప్రమాదకరంగా గుంత

మండలంలోని బావిపల్లె వెళ్లే రహదారి మధ్యలో గుంత ఏర్పడింది. ఈ రహదారి గుండా హుస్సేనాపురం, చంద్రపల్లె, రాయలచెరువు వరకు నిత్యం వాహనాలు రాకపోకలు సాగిస్తుంటారు. పెద్ద గుంత ఉండటంతో వాహన చోదకులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఆర్‌అండ్‌బీ అధికారులు రహదారికి మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే ప్యాపిలి**